

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 23-10-2024 | సంపుటి - 21 | సంచిక -188 | రూ : 4 | పేజీలు: 8



2లో

## ఇది కుట్రా... లేక ద్వేషమా?

- హిందూ వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్ సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై 'ఎక్స్'వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్: వివిధ హిందూ సంస్థల కార్యకర్తల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. హిందూ సంస్థల పట్ల, ఆ సంస్థల కార్యకర్తలపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం తరువాయి 2లో

### మరో 79 విమానాలకు

# బాంబు బెదిరింపులు

- వారంలో ఇప్పటికి 169 బెదిరింపు కాల్స్
- దేశవ్యాప్తంగా సీఆర్పీఎఫ్ స్కూళ్లకూ బెదిరింపులు
- బెంగళూరు-వారాణసీ విమానం
- శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్
- ఆ సమయంలో దిగాల్సినవి విజయవాడకు..
- ఢిల్లీ-హైదరాబాద్ సర్వీసు 45 నిమిషాలు గాల్లోనే


న్యూఢిల్లీ, అక్టోబరు 22: విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ ఆగడం లేదు. ఇలాంటి కాల్స్ చేసే వారికి జీవిత ఖైదు విధించేలా చట్ట సవరణ చేస్తామని, నో ఫ్లై జాబితాలో చేర్చుతామని సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా, ఈ బెదిరింపు కాల్స్ తరువాయి 2లో



# సంక్షోభానికి చర్చలే పరిష్కారం

- మేం అన్ని పక్షాలతో సంప్రదింపుల్లో ఉన్నాం
- ఏ సమస్య అయినా శాంతియుత మార్గాల్లో
- పరిష్కారం కావాలి.. మేం పూర్తిగా సహకరిస్తాం
- శాంతిస్థాపన ప్రక్రియకు సిద్ధం..
- బ్రిక్స్‌లో మోదీ
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని సమావేశం

కజాన్, అక్టోబరు 22: ఎలాంటి సంక్షోభానికైనా చర్చలే పరిష్కార మార్గమని.. సమస్యలను శాంతియుతంగా పరిష్కరిం తరువాయి 2లో





## ఈవీ రంగంలో అద్భుతం..

- ప్రయాణించే కొద్దీ పెరిగే బ్యాటరీ ఎనర్జీ!
- అన్‌లిమిటెడ్ రేంజ్ ఈవీ!
- 'ఈ-క్యాట్' టెక్నాలజీతో అద్భుతం

లాటినా (ఇటలీ), అక్టోబర్ 20: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) రంగంలో అద్భుతం ఆవిష్కృతమైంది. మాడిఫై చేసిన ఓ ఎలక్ట్రిక్ కారుతో 'అన్‌లిమిటెడ్ రేంజ్' సాధ్యమైంది. ఇటలీలోని లాటినాలో గత నెల ఆ కారు పనితీరును ప్రదర్శించారు. 6 గంటలపాటు ప్రయాణించిన తర్వాత ఆ కారు బ్యాటరీలో శక్తి సాంద్రత తగ్గకపోగా మరింత పెరిగినట్టు ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ నిపుణులు తేల్చారు. ఈ ప్రదర్శనలో ప్రముఖ తరువాయి 2లో

## సీట్లొచ్చినా.. చేరేదెవరు?



- ఇప్పటికే పూర్తయిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్.. మొదలైన తరగతులు
- హైకోర్టు తీర్పుతో కాలేజీల్లో పెరగనున్న 3వేల సీట్లు..
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సర్కార్
- న్యాయపోరాటానికి వెనుకాడని కాలేజీలు
- సీట్ల పెంపు వ్యవహారంలో నాటకీయ పరిణామాలు

హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు వ్యవహారంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సీట్ల పెంపును ప్రభుత్వం అడ్డుకుంటే, కాలేజీలే సీట్లు భర్తీ చేసుకునేందుకు హైకోర్టు అనుమతించింది. ఇప్పటికే రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. క్లాసులు కూడా మొదలయ్యాయి. విద్యార్థులంతా ఇంజనీరింగ్, డిగ్రీ, లేదా ఇతర రాష్ట్రాల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. నేపథ్యంలో హైకోర్టు తీర్పుతో పెరిగే దాదాపు 3 వేల సీట్లు ఎలా భర్తీ అవుతాయనేది అర్థం కావడం లేదు. కోర్టు తీర్పు రాగానే ప్రైవేటు కాలేజీలు స్పాట్ అడ్మిషన్లు చేపట్టాయి. ఎంతమంది వస్తే అంతమందిని చేర్చుకుంటున్నాయి. విద్యాజ్యోతి కాలేజీలో 120 సీట్లు పెరిగితే 15 మంది స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరారు. మిగతా మూడు కాలేజీల్లోనూ ప్రవేశాలు కొంత మేర జరిగాయి. ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సీట్ల పెంపును తరువాయి 2లో

### భారీ వర్షాలతో

# బెంగళూరు అతలాకుతలం

- భవనం కూలి ఒకరు మృతి
- శిథిలాల కింద చిక్కిన మరో ఏడుగురు!



న్యూఢిల్లీ, అక్టోబర్ 21: దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై మరోసారి చర్చ మొదలయ్యింది. త్వరలో జనగణన చేపట్టి, కొత్త జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాలను కేంద్రం పునర్విభజన చేయనుందనే ప్రచారం జరుగుతున్నది. ఇదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరగనుంది. మరోవైపు లోక్‌సభతో పాటు దేశ రాజకీయాల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రాబల్యం పెరగనుంది. కేంద్రంలో అధికారంలో తరువాయి 2లో

# 'ఉమ్మడి అనంత'లో కుంభవృష్టి

- సోమవారం రాత్రి మొత్తం భారీ వర్షం
- పోటెత్తిన పండమేరు.. అనంతపురం నగర శివారు కాలనీలు జలమయం
- వరదపై ముందస్తు సమాచారం లేక కట్టుబట్టలతో మిగిలామని బాధితుల ఆవేదన
- వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు

2లో



### భారత అమ్ముల పొదిలో

# అణు జలాంతర్గామి

- విశాఖ ఎస్‌బీసీలో ఎస్ఎస్‌బీఎన్ ఎస్-4 సబ్‌మెరైన్ ప్రారంభం

విశాఖ సిటీ: భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అణు శక్తిని పెంపొందించుకునే క్రమంలో రక్షణ వ్యవస్థలోకి కొత్తగా అణు జలాంతర్గామి ప్రవేశించింది. అణుశక్తితో నడిచే భారత నాలుగవ బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్ 4) అరిధమాన్ విశాఖ సముద్ర తీరంలో నీటిలోకి ప్రవేశించింది. తరువాయి 2లో



## 'డబుల్' ఇండ్ల వాసులకు హైడ్రా పేరిట వార్నింగులు

- ఇండ్లలోకి రాకపోతే పట్టాలు రద్దు అవుతాయని పైసలు వసూల్
- విద్యుత్ శాఖ పేరిట కూడా మోసాలు
- రూ.వేలకు వేలు గుంజుతున్న కేటుగాళ్లు
- ప్రతాపసింగారం, బాటసింగారం, బాచుపల్లిల్లో ఘటనలు

2లో



# సంక్షోభానికి చర్చలే పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

చుకోవాలని.. ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అన్నారు. రెండున్నరేళ్లకు పైబడి సాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాము అన్ని పక్షాలతో సంప్రదింపుల్లో ఉన్నామని, శాంతి స్థాపనకు అవసరమైన ఎలాంటి సహకారాన్నైనా అందించేందుకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. సమయం వస్తే అన్ని విధాలా సహకరిస్తామని.. మానవత్వానికే తమ ప్రాధాన్యమని చెప్పారు. రష్యాలోని కజాన్ నగరంలో మంగళవారం ప్రారంభమైన బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సుకు హాజరైన ప్రధాని మోదీ.. రష్యా అధినేతతో చర్చలు జరిపారు. జూలైలో ఇరు దేశాల 22వ శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధాని మోదీ మాస్కోలో పర్యటించిన సంగతి తెలిసిందే. మూడు నెలల వ్యవధిలోనే ఆయన రష్యాలో రెండోసారి పర్యటించడం గమనార్హం. అప్పటిలాగానే.. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మంగళవారం సైతం రష్యా అధ్యక్షుడిని మోదీ ఆలింగనం చేసుకున్నారు. మూడు నెలల్లోపే రష్యాలో రెండోసారి పర్యటిస్తుండడాన్ని ప్రస్తావించి.. ఇది రెండు దే శాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు, ప్రగాఢమై న విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. బ్రిక్స్ సదస్సుకు సారథ్యం వహించడమే కాక.. మరికొన్ని దే శాలూ చేరేలా చొరవ చూపినందుకు పుతిన్‌కు అభినందనలు తెలిపారు. సదస్సు ముగింపు సందర్భంగా.. ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, యూఏఈలను సభ్యదేశాలుగా చేర్చుకుంటూ 'కజాన్ డిక్లరేషన్'ను ప్రకటించనున్నారు. దీంతో సభ్యదేశాల సంఖ్య 10కి పెరగనుంది. కాగా, వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం తదితర కీలక విషయాల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు బ్రిక్స్ ప్రధాన వేదికగా మారిందని మోదీ పేర్కొన్నారు. కజాన్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రధాని.. రష్యాతో చరిత్రాత్మక సంబంధాలను గుర్తు చేశారు. అలాగే.. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు.

**మా బంధం దృఢమైనది..**

భారత్‌తో సంబంధాలను అత్యంత విశిష్టమైనవిగా పుతిన్ అభివర్ణించారు. ఈ బంధం చెక్కుచెదరని.. స్నేహం నిరంతరం మెరుగవుతూనే ఉంటుందని పేర్కొన్నారు. తన భాషను మోదీ అర్థం చేసుకుంటారని.. ఈ సమావేశంలో అనువాదం అవసరం లేదని వ్యాఖ్యానించారు. దీనికి మోదీ చిరునవ్వులు చిందించారు. కాగా, జూలైలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలను పుతిన్ ప్రస్తావించారు. మోదీ, తాను ఎన్నోసార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు చెప్పారు. తన ఆహ్వానాన్ని మన్నించి కజాన్‌కు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ బుధవారం భేటీ కానున్నట్టు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. గడిచిన ఐదేళ్లకాలంలో మోదీ, జిన్‌పింగ్ పలు వేదికలపై కలిసి కనిపించినప్పటికీ.. ముఖాముఖి భేటీ కావడం మాత్రం ఇదే తొలిసారి. 2019లో కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో వీరిద్దరూ ముఖాముఖి మాట్లాడుకున్నారు. ఆ తర్వాత 2020లో గల్వాన్‌లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలూ ఇన్నాళ్లుగా ఏకాంతచర్చలు జరపలేదు.

**కృష్ణభక్తుల స్వాగతం**

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు కజాన్‌కు వెళ్లిన ప్రధాని మోదీకి.. ఆయన బస చేసిన హోటల్ వద్ద ఇస్కాన్ సభ్యులు కృష్ణుడి భజనలతో, సంస్కృత గీతంతో స్వాగతం పలికారు. వారు కృష్ణ భజన చేస్తున్నంతసేపూ మోదీ రెండు చేతులూ జోడించి అలా ఉండిపోయారు. అలాగే, కొందరు రష్యా కళాకారులు.. తమ సంప్రదాయ నృత్యాలతో మోదీకి స్వాగతం పలికారు. ప్రధాని రాక సందర్భంగా ఆ హోటల్ వద్దకు వచ్చిన పలువురు భారతీయులు చేతిలో మువ్వన్నెల పతాకాలను పట్టుకుని, ఉత్సాహంగా ఊపుతూ ఆయన్ను పలకరించారు. వారిలో చాలా మందితో మోదీ కరచాలనం చేశారు. పలువురు ఆయనతో సెల్ఫీలు దిగారు.

# సీట్లొచ్చినా.. చేరేదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకునేందుకు ప్రభుత్వం.. ఎలాగైనా సీట్లు పెంచుకునేందుకు ప్రైవేటు కాలేజీలు న్యాయపోరాటానికీ వెనుకాడటం లేదు.

**వచ్చే ఏడాదిపైనే ఆశ**

డిమాండ్ లేని ఇతర కోర్సుల్లో సీట్లు తగ్గించుకుని కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ప్రైవేటు కాలేజీలు సీట్లు పెంచుకున్నాయి. అనుమతులూ తెచ్చుకున్నాయి. దీనికి ప్రభుత్వం ససేమిరా అనడం, వివాదం కోర్టు మెట్లెక్కడం తెలిసిందే. ఆలస్యంగా తీర్పు వచ్చినా ప్రైవేటు కాలేజీలు సీట్లపై ఎందుకు ఆసక్తి చూపుతున్నాయనే సందేహాలు కలుగుతున్నాయి. కాలేజీలు ఈ సంవత్సరాన్నే దృష్టిలో పెట్టుకోలేదు.

ఇప్పుడు సీట్లు పెరిగితే, వచ్చే ఏడాదీ ఇది కొనసాగుతుంది. ఈ ఏడాది ప్రవేశాలు కాకున్నా, కంప్యూటర్ సీట్లు కావడం వల్ల వచ్చే ఏడాది అన్నీ భర్తీ అయ్యే వీలుంది. ఒక్కో బ్రాంచీలో 120 సీట్లు ఉంటే, మేనేజ్‌మెంట్ కోటా కింద దాదాపు 33 సీట్లు ఉంటాయి. కంప్యూటర్ సైన్స్‌లో ఒక్కో సీటు రూ.16 లక్షలపైనే పలుకుతుంది. డిప్లొమా కోర్సుల ద్వారా రెండో ఏడాదిలోనూ ఇంజనీరింగ్ సీట్లు కేటాయిస్తారు. ఇందులోనూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పెంచుకునే వీలుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వంపై న్యాయ పోరాటానికి కాలేజీలు సిద్ధపడుతున్నాయి.

**ప్రభుత్వం పట్టుదల ఎందుకు?**

హైకోర్టు తీర్పును ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అక్కడ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే స్పాట్ ద్వారా చేరిన విద్యార్థులకు ఇబ్బంది తప్పదని అధికార వర్గాలు అంటున్నాయి. సీట్ల పెంపును అడ్డుకోవడాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రైవేటు కాలేజీలపై నియంత్రణ దిశగా వెళ్లాలనుకుంటున్న ప్రభుత్వానికి ఈ విషయం కీలకమని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు సీట్ల పెంపును అనుమతిస్తే, భవిష్యత్‌లో ప్రతీ కాలేజీ సివిల్, మెకానికల్ సీట్లు రద్దు చేసుకునే ప్రమాదం ఉందని, సీఎస్ఈ దాని అనుబంధ కోర్సులే ఉండే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కారణంగానే సీట్ల పెంపును అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకూ పోరాడుతోందని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

# 'ఉమ్మడి అనంత'లో కుంభవృష్టి

(మొదటిపేజీ తరువాయి)

అనంతపురం అగ్రికల్చర్/పుట్టపర్తి అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 9 గంటలకు మొదలైన వాన జోరు మంగళవారం వేకువజాము వరకు కొనసాగింది. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో పలు మండలాల్లో కుంభవృష్టి కురిసింది. ఏకధాటిగా నాలుగైదు గంటలపాటు భారీ వర్షం కురవడంతో చాలా మండలాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాప్తాడు మండలం బండమీదపల్లి చెరువు కట్ట తెగిపోయి దిగువ ప్రాంతానికి వరద పోటెత్తడంతో దాదాపు 70 గొర్రెలు కొట్టుకుపోయాయి.

రామగిరి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, పెనుకొండ, కొత్తచెరువు, పుట్టపర్తి ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో చిత్రావతి, వంగపేరు, కుషావతి, జయమంగళి నదులతోపాటు పలు చెరువులు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాల కారణంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, కొర్ర, మొక్కజొన్న తదితర పంటలు వందలాది ఎకరాల్లో దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన రైతు రమణారెడ్డి రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన ద్రాక్ష తోట మొత్తం నేలమట్టమయ్యింది.

రూ.20 లక్షలకు పైగా నష్టపోయినట్లు రైతు వాపోయారు. శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లిలో రికార్డు స్థాయిలో 198.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గంలో 89.4 మి.మీ., కంబదూరులో 65.4 మి.మీ., ఆత్మకూరులో 60 మి.మీ. చొప్పున భారీ వర్షం కురిసింది. కాగా.. రానున్న రెండు రోజులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**పండమేరు ఉగ్రరూపం... నీట మునిగిన పలు కాలనీలు**

ఎగువన భారీ వర్షాలు కురవడంతోపాటు కనగానపల్లి చెరువుకట్ట తెగిపోవడంతో పండమేరు ఉధృతంగా ప్రవహించింది. పండమేరు వెంబడి ఉన్న అనంతపురం నగర శివారులోని గురుదాస్ కాలనీ, ఆటో కాలనీ, వనమిత్ర పార్క్ వెనుక కాలనీలు, రామకృష్ణ కాలనీ, కళాకారుల కాలనీ, బృందావన కాలనీ, పరిటాల సునీతమ్మ కాలనీ, దండోరా కాలనీ, రాజరాజేశ్వరి కాలనీలు నీట మునిగాయి. సుమారు 300 కుటుంబాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరదపై అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఫలితంగా కట్టుబట్టలతో మిగిలామని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు.

# భారత అమ్ముల పొదిలో అణు జలాంతర్గామి

విశాఖ సిటీ: భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అణు శక్తిని పెంపొందించుకునే క్రమంలో రక్షణ వ్యవస్థలోకి కొత్తగా అణు జలాంతర్గామి ప్రవేశించింది. అణుశక్తితో నడిచే భారత నాలుగవ బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్4) అరిధమాన్ విశాఖ సముద్ర తీరంలో నీటిలోకి ప్రవేశించింది. తెలంగాణలో నేవీ రాడార్ కేంద్రం ప్రారంభించిన మరుసటి రోజే.. అక్టోబర్ 16న విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్(ఎస్‌బీసీ)లో దీని ప్రారంభోత్సవం జరిగినట్లు సమాచారం. ఇది బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ కలిగిన మొట్టమొదటి అణు జలాంతర్గామి కావడం విశేషం. కొత్తగా ప్రారంభించిన ఎస్ఎస్‌బీఎన్ ఎస్4ను 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు. ఇండోపసిఫిక్ రీజియన్‌లో శత్రువులను ఎదుర్కోవడంలో ఈ జలాంతర్గాములు కీలక పాత్ర పోషించనున్నాయి. దీనిలో 3,500 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాన్ని సైతం ఛేదించేలా కె4 అణు బాలిస్టిక్ క్షిపణులను అమర్చారు. ఈ క్షిపణులను నిట్టనిలువుగా ప్రయోగించే వీలు ఉంది. అయితే మొట్టమొదటి అణు జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ అరిహంత్ కేవలం 750 కి.మీ.పరిధి లక్ష్యాన్ని మాత్రమే ఛేదించగలదు. దీనిలో కె15 అణు క్షిపణులు ఉన్నాయి.

అదే శ్రేణిలో నూతన సాంకేతికత, నవీకరణలతో రూపొందిన ఈ ఎస్4 జలాంతర్గామి కే4 క్షిపణులను అమర్చే సామర్థ్యం కలిగి ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ జలాంతర్గాములను తొలుత కోడ్ నేమ్‌లతో పిలుస్తారు. ఈ క్రమంలోనే ఐఎన్ఎస్ చక్రకు ఎస్1, ఐఎన్ఎస్ అరిహంత్‌కు ఎస్2, అరిఘాత్‌కు ఎస్3, అరిధమాన్‌కు ఎస్4 అని కోడ్ నేమ్ ఇచ్చారు. ఇప్పటికే ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్‌లు సముద్ర గస్తీలో ఉన్నాయి. తాజాగా ఎస్4 కూడా భారత రక్షణ వ్యవస్థలో చేరి దేశానికి సేవలు అందించడంలో నిమగ్నమైంది. కీలకమైన హిందూ మహా సముద్రంపై ఆధిపత్యంలో కీలక పాత్ర పోషించడంలో భాగంగా భారత్ మరిన్ని అధునాతన జలాంతర్గాములను సిద్ధం చేయడంపై దృష్టి సారించింది.

# 'డబుల్' ఇండ్ల వాసులకు హైడ్రా పేరిట వార్నింగులు

హైదరాబాద్ సిటీ : గ్రేటర్ పరిధిలోని ప్రతాపసింగారం, బాటసింగారం, బాచుపల్లి పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉంటున్న జనాలు నిత్యం ఏదో ఒక ఫేక్ కాల్‌తో ఆందోళనకు గురవుతున్నారు. ఇండ్లలోకి రాకముందు, వచ్చిన తర్వాత వారికి వేధింపులు తప్పడం లేదు. లాటరీలు తీసి ఇంకా గృహ ప్రవేశం చేయకముందే కరెంట్ రిపేర్ల కోసమని, వాటర్ లైన్ , ఇండ్ల రిపేర్ల కోసమంటూ కేటుగాళ్లు ఫోన్లు చేసి అందినకాడికి దండుకున్నారు. ఇలా ఇప్పటికే ఎంతోమంది మోసపోయారు. తాజాగా హైడ్రా ట్రెండ్‌నడుస్తుండడంతో హైడ్రా, ఎలక్ట్రిసిటీ అధికారుల పేరిట ఇండ్లలోకి వచ్చిన వారిని, కేటాయించినా ఇంకా రానివారికి ఫోన్లు చేసి బెదిరించి డబ్బులు గుంజుతున్నారు.

'మీ డబుల్ ఇండ్లపై హైడ్రా విచారణ జరుగుతోంది. మీరు ఇంకా ఇండ్లలోకి రాలేదు. డబ్బులివ్వకపోతే మీ ఇంటి పట్టాలు రద్దవుతాయి' అని కొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. అలాగే ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామని రూ.1250 కట్టకపోతే కరెంట్ మీటర్ మీ పేరుపై కాదని కాల్స్ చేస్తున్నారు. రూ.5 వేలు అంతకు మించి డబ్బులను ఫోన్ పే, గూగుల్ పే చేయించుకుని జేబులు ఖాళీ చేయిస్తున్నారు.

**హైడ్రా ట్రెండింగ్‌లో ఉండడంతో...**

బాటసింగారంలో సుమారు 1400 , ప్రతాపసింగారంలో 2200, బాచుపల్లిలో 1200 డబుల్‌బెడ్‌రూం ఇండ్లు పూర్తి చేశారు. అసెంబ్లీ ఎలక్షన్లకు ముందే అధికారులు లాటరీలు తీసి పట్టాలు అందజేశారు. అయితే మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించకపోవడంతో మూడు చోట్ల కలిపి వెయ్యి మంది మాత్రమే ఇండ్లలోకి వచ్చారు.

నీటి సౌలత్‌సరిగ్గా లేకపోవడం, కరెంట్‌సమస్యలు ఉండడం, లిఫ్ట్‌లు పని చేయకపోవడంతో చాలా మంది గృహ ప్రవేశం చేయలేదు. దీన్ని ఆసరాగా చేసుకున్న మోసగాళ్లు ఇండ్లలోకి రాని వారిని ఒక కారణంతో, వచ్చిన వారిని మరో కారణంతో బెదిరించి దండుకున్నారు. ఇప్పుడు స్టైల్‌మార్చి హైడ్రా, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ పేరిట చీట్ చేస్తున్నారు.

లాటరీ లిస్ట్ బయటకు పోవడంతోనే..

డబుల్ ఇండ్లను ప్రజలకు అందించిన సమయంలో ఆయా జిల్లాల కలెక్టరేట్లలో లాటరీలు తీశారు. ఆ లాటరీ లిస్ట్‌లో లబ్ధిదారుల పేర్లతో పాటు ఫోన్ నంబర్లు కూడా ఉన్నాయి. దీంతో ఇవి బయటకు పోయి కేటుగాళ్లకు చిక్కడంతో మోసాలు చేస్తున్నారు. ఆ డేటా యూపీ, బిహార్ తదితర రాష్ట్రాలకు చేరడంతో అక్కడి నుంచే ఫోన్లు చేసి బెదిరించి డబ్బులు దండుకుంటున్నారు.

# ఇది కుట్రా... లేక ద్వేషమా?

(మొదటిపేజీ తరువాయి)

'ఎక్స్'వేదికగా విరుచుకుపడ్డారు. 'ఇది కుట్రా? లేక ద్వేషమా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని హిందూ వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి'అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'ముందుగా...భారతీయ న్యాయసంహిత సెక్షన్ 176, సెక్షన్ 173 నిబంధన కింద 3 క్రిమినల్ కేసులకింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన పోలీసులు.. సోమవారం అర్ధరాత్రి సమయంలో..ఆ ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేసి సెక్షన్ 109 (హత్యాయత్నం)ను చేర్చారు. ఇది హిందూ సంస్థల సభ్యులను హింసించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచనను తెలియజేస్తోంది'అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# మరో 79 విమానాలకు బాంబు బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

ఆగలేదు. గడిచిన 24 గంటల్లో మరో 79 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిలో మంగళవారం ఒక్క రోజే 50 విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. ప్రధానంగా అంతర్జాతీయ మార్గాల్లో నడిచే విమానాలకు ఈ కాల్స్ వచ్చాయి. ఇండిగో విమానాలు 23, విస్తారా 21, ఆకాశ 12, ఎయిరిండియాకు చెందిన 23 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటితో కలిసి వారం రోజుల్లో మొత్తం 169 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లయింది. తాజాగా దేశీయ సర్వీసులతో పాటు జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ వంటి అంతర్జాతీయ నగరాలకు వెళ్లే విమానాలకు ఈ కాల్స్ వచ్చాయి. 90కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులపై ఢిల్లీ పోలీసులు 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరోవైపు సీఆర్పీఎఫ్ పాఠశాలలకూ బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటిపై సీఆర్పీఎఫ్, నిఘ విభాగం, ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భారీ వర్షాలతో బెంగళూరు అతలాకుతలం..

(మొదటిపేజీ తరువాయి)

ఎవరుండాలనేది నిర్ణయించడంలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర తగ్గిపోనున్నది. తాజాగా తమిళనాడు బనశంకరి: కర్ణాటక రాజధాని బెంగళూరులో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తమైంది. నగరంలోని బాబుసాబ్ పాళ్యలో నిర్మాణ దశలో ఉన్న బహుళ అంతస్తుల కట్టడం మంగళవారం సాయంత్రం కుప్ప కూలింది. ఈ ఘటనలో ఒకరు చనిపోయారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానికులు పది మందిని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. శిథిలాల కింద మరో ఏడుగురి వరకు చిక్కుకుని ఉన్నట్లు చెబుతున్నారు. ఘటన సమయంలో భవనంలో 18 మంది వరకు కూలీలున్నట్లు తెలిసింది.

**జల దిగ్బంధంలో అపార్ట్‌మెంట్లు**

బంగాళాఖాతంలో అల్ప పీడనం, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మంగళవారం యలహంకలోని కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి చెరువు నీరు పోటెత్తింది. దీంతో అపార్ట్‌మెంట్‌లోని 2 వేల మంది చిక్కుబడి పోయారు. 650 కుటుంబాలకు గాను 250 కుటుంబాలను బయటకు తరలించారు.

# అక్కడ ఎన్నికలు.. ఇక్కడ అలర్ట్

**మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అధికారుల అప్రమత్తం**

**బార్డర్లలో చెక్‌పోస్టుల ఏర్పాటు, ముమ్మరంగా వాహనాల తనిఖీలు**

**మహారాష్ట్ర అధికారులతో సమన్వయం**

**మద్యం, నగదు రవాణాపై నిఘా**

ఆదిలాబాద్ : మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యుల్ విడుదలవడంతో ఆ రెండు రాష్ట్రాల్లో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలువైపులా మహారాష్ట్రతో సరిహద్దులుండడంతో రాకపోకలు, రవాణాపై ఇక్కడి పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నగదు, మద్యం, మత్తుపదార్థాల రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మహారాష్ట్ర పోలీసుల సమన్వయంతో ఇటు జిల్లా సరిహద్దులు, అటు మహారాష్ట్ర ప్రాంత సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.

**మహా బార్డర్‌లో నిఘా..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులో చంద్రాపూర్, నాందేడ్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలు ఉన్నాయి. ఆ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అక్కడి అధికారులు ఆదిలాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో మన జిల్లా సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని శంకర్ గూడ, జైనథ్ మండలంలోని ఆనంద్ పూర్, పిప్పర్‌వాడ, బోథ్ ఘన్ పూర్, తలమడుగు మండలం లక్ష్మీపూర్, భీంపూర్ కరంజీ, గాధీగూడ మండలం మేడిగూడ ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి చెక్ పోస్ట్ లో ఒక ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లతో 24 గంటలు నిఘా ఉంచారు. నిర్మల్ జిల్లాలోని ముథోల్, బాసర, కుంటాల, సారంగాపూర్, కుభీర్ మండలాలు, కుమ్రం భీం జిల్లాలోని బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి, మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి, చెన్నూర్, వేమనపల్లి మండలాలు మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు.

**రెండు రాష్ట్రాల పోలీసుల సమన్వయం..**

ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులు సమన్వయంతో ముందుకెళ్తున్నారు. ఇటీవల చంద్రాపూర్‌లో మహారాష్ట్ర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. మంగళవారం యావత్ మాల్ జిల్లాలో సమావేశం నిర్వహించగా ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం పాల్గొని ఇక్కడి పరిస్థితులపై మాట్లాడారు. జిల్లా సరిహద్దులోంచి మహారాష్ట్రలోకి ఎలాంటి అక్రమ రవాణాను నిరోధించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆదిలాబాద్ జిల్లా మీదుగా గంజాయి రవాణా జరుగుతుండగా అరికట్టడంపై చర్చించారు. బార్డర్‌లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మద్యం, నగదు, మత్తు పదార్థాలు, ఓటర్లను ప్రలోభపెట్టే బహుమతులు సరఫరా చేసే అవకాశాలుండడంతో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**నిఘా కట్టుదిట్టం చేశాం**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా కట్టుదిట్టం చేశాం. ఎలాంటి మద్యం, నగదు, మత్తు పదార్థాలను అక్రమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. 24 గంటల పాటు పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

## బొల్లెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు నూతన భవనం కావాలని ఎమ్మెల్యేకి వినతి



బొల్లెపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బొల్లెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ కొంత భాగం కూలిపోయిందని తెలుసుకోని అక్కడికి వెళ్లి పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కనుకుంట్ల బాబు రావ్ , గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు హై స్కూల్ ను పరిశీలించారు. స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో మాట్లాడి స్కూల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగకుండా చూడాలని గ్రామ పెద్దలు స్థానిక ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో స్పందించిన ఆయన వీలైనంత తొందరగా నూతన పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్, శ్రీ లోజ్ హరి శంకర్, జిట్టా కృష్ణారెడ్డి, నాంపల్లి మల్లేశం, పంజాల సత్యనారాయణ, మాద సత్యనారాయణ, గండికోట యాదగిరి, ఎండి సలీం, వరికుప్పల ఇంద్రసేన, రావి హేమంత్ రెడ్డి, బోళ్ల లింగస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు కనకుంట్ల కొండల్, చిన్న పాక బాలస్వామి, కనకుంట్ల సురేష్, సందల మహేష్,లు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ఎమ్మెల్యే ను కలిసిన ట్రిబుల్ ఆర్ బాధితులు

- **అలైన్మెంట్ మార్చాలి లేనిచో పరిహారమైన పెంచాలని వినతి**
- **సీఎం దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హామీ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రీజనల్ రింగ్ రోడ్డు వల్ల భూములు కోల్పోతున్న చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్నామని ప్రభుత్వంతో మాట్లాడి అలైన్మెంట్ మార్పించాలని, లేనిచో బహిరంగ మార్కెట్ విలువ ద్వారా పరిహారమైన చెల్లించాలని విన్నవించారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణభాగం ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 40కి.మీ. మేర తీసుకున్నారని, ఉత్తరభాగానికి వచ్చేసరికి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 28కి.మీ. దూరం మాత్రమే తీసుకున్నారని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. కాగా ఉత్తరభాగం దక్షిణ భాగం జంక్షన్ చౌటుప్పల్ వద్ద వస్తున్న నేపథ్యంలో భూములు ఎక్కువగా కోల్పోవాల్సి వస్తుందని, వీలైతే అలైన్ మెంట్ లో మార్పులు తీసుకురావాలని కోరారు. సాధ్యం కానిచో భూములు కోల్పోతున్న బాధితులకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర చెల్లించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి చర్చించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ట్రిబుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న బాధితుల సమస్య తన దృష్టిలో ఉందన్నారు. త్వరితగతిన సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్యపై చర్చిస్తానని రీజినల్ రింగ్ రోడ్డు బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండలం ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఇండియన్ అవార్డ్ 2024 సద్గురు ఇషా ఫౌండేషన్ కు ప్రధానం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : కెనడా ఇండియా ఫౌండేషన్ (సీఐఎఫ్ ) ప్రతిష్టాత్మకమైన సీఐఎఫ్ గ్లోబల్ ఇండియన్ అవార్డ్ 2024ను భారతీయ యోగి, ఆధ్యాత్మికవేత్త, సద్గురు ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకులకు ప్రదానం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపిన భారతీయ సంతతికి చెందిన వ్యక్తులను జరుపుకునే ఈ అవార్డు, ఒక కాన్షియస్ ప్లానెట్ ను రూపొందించడంలో సద్గురు అసమానమైన కృషిని, పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో మానవ చైతన్యాన్ని పెంపొందించడంలో ఆయన నాయకత్వాన్ని గుర్తిస్తుంది. కెనడా ఇండియా ఫౌండేషన్ ఛైర్ అయిన రితేష్ మాలిక్ ఇలా పంచుకున్నారు, "సుదీర్ఘమైన ప్రముఖ పేర్లలో చేరడానికి సద్గురు అంగీకరించడమే కాకుండా, స్వీకరించడానికి టొరంటోకు హాజరుకావడానికి కూడా అంగీకరించడం నిజంగా అదృష్టమని తాము భావిస్తున్నామని పేర్కొన్నారు.అవార్డు సద్గురు అతి ముఖ్యమైన సందేశం మొత్తం మానవాళికి అలాగే మన గ్రహం భవిష్యత్తుకు సంబంధించిన ప్రభావాలను కలిగి ఉందని, సద్గురులో, ప్రాచీన భారతీయ ఆధ్యాత్మిక, జ్ఞాన వ్యవస్థల జ్ఞాన సంప్రదాయాలతో పాటు దురదృష్టవశాత్తూ అంత సాధారణం కానటువంటి సూటిగా ఉండే ఇంగితజ్ఞానం ద్వారా మార్గనిర్దేశం చేయబడిన ప్రస్తుత సవాళ్లను అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమైన విషయం అని పేర్కొన్నారు.

## బీజేపీ హయంలో
# దేశం ఆర్ధికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది

- **కేంద్ర మాజీ బిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి**



యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : ప్రపంచంలో దేశాన్ని అగ్ర పదంలో నిలుపుతున్నటువంటి నరేంద్ర మోడీ ని ఎంతో కీర్తిస్తున్నదని కేంద్ర మాజీ బిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. సోమవారం బిజెపి భువనగిరి పట్టణ అధ్యక్షులు 24వ వార్డు కౌన్సిలర్ రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో దోబివాడలో సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మాజీ బిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి హజరై మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కరోనా సమయంలో ప్రపంచం అల్లాడిపోతున్న సమయంలో దేశ ప్రజలకు ఉచితంగా రేషన్ అలాగే వ్యాక్సిన్ ప్రపంచంలో ఉచితంగా పంపిణీ చేశారని అలాంటి నాయకుడు భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని దేశ ప్రజలందరూ సపోర్ట్ చేస్తూ అత్యధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు నిర్వహించాలని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, జిల్లా సభ్యత్వ ఇంచార్జ్ చాడ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, పోతంషెట్టి రవీందర్, సీనియర్ నాయకులు నార్ల నర్సింగరావు, వేముల అశోక్, లీగల్ సెల్ కో కన్వీనర్ వంగేటి విజయభాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాళ్లబండి కృష్ణ చారి, రత్నపురం శ్రీశైలం, వల్లంశెట్టి నాగేష్, ఉపాధ్యక్షులు ఎంగిలి లక్ష్మణ్, యాట వెంకటేష్, రాజు చారి, కొల్లోజు సతీష్, కానుకుంట్ల రమేష్, దాసరి స్వామి, ఉషా కిరణ్, కొలిచెలిమ మల్లికార్జున్, శ్రీరామ్, నందు, సంతు, వార్డులో ప్రజలు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రాయోజిత పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

- **పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి**
- **పాఠశాల హెడ్ మాస్టర్ పై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలి**




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం : జిల్లాలోని ప్రజలకు కేంద్ర ప్రాయోజిత పథకాల లబ్ది పొందేలా అధికారులు పని చేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్,పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్ లతో కలిసి నిర్వహించారు.దిశ సమావేశంలో ప్రస్తుతం వారి శాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, రాబోయే 3 నెలల కాలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, తదితర అంశాలపై జిల్లా సంక్షేమ అధికారి, జీఎం పరిశ్రమలు,జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి,ఈఈ హౌసింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి,ఖమ్మం మున్సిపల్ కమిషనర్,జాతీయ రహదారులు,విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలు వివరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ బ్యాటరీ ఆధారిత వాహనాలను అవసరం,అర్హత ఉన్న దివ్యాంగులకు అందించేందుకు కేంద్ర అధికారులను ఫాలో అప్ చేస్తూ క్యాంపు నిర్వహణ కోసం కృషి చేయాలని, జిల్లా వ్యాప్తంగా అవసరమైన బ్యాటరీ ట్రై సైకిళ్లు నివేదిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే ఫిర్యాదు ప్రకారం సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ పై వేరే మండలాలకు చెందిన అధికారులతో విచారణ నిర్వహించి ఆ నివేదికను నేరుగా జిల్లా కలెక్టర్,ఎంపీకి అందజేయాలని,విధుల పట్ల నిర్లక్ష్యం,అవినీతికి పాల్పడే సిబ్బంది,అధికారులను ఉపేక్షించేది లేదని ఎంపీ తెలిపారు. సత్తుపల్లిలో మంజూరైన ఆసుపత్రులలో సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లపై ఉన్నతాధికారులకు కలెక్టర్ ద్వారా నివేదిక సమర్పించాలని ఎంపీ సూచించారు. జిల్లాలో మంజూరైన జాతీయ రహదారుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు.జాతీయ రహదారుల నిర్మాణానికి పెండింగ్ భూ సేకరణ పూర్తి చేసి జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలని అన్నారు.అటవీ ప్రాంతం నుంచి వచ్చే ఇసుకను సొంత అవసరాలకు ప్రజలు వాడుకునేందుకు గల అవకాశాలను పరిశీలించి అనుమతించాలని ఎంపీ అధికారులను కోరారు. యాసంగి నుంచి పంట బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రైతుల తరపున భీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించాలని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పాలు, ఇతర పోషకాహారం వినియోగం నాణ్యతను పరిశీలిస్తూ నివేదిక అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారిని ఆదేశించారు. జిల్లాలో 5 మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టు క్రింద చిన్నారి కార్యక్రమం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో పిల్లల హెల్ప్ లైన్, డ్రగ్స్ వినియోగం, బాల్య వివాహాల నివారణ మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టామని అన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, ముద్రా రుణాలు, పిఎంఎఫ్ఎంఈ,ముద్రా రుణాలు మొదలగు అంశాలపై ప్రచారం కల్పిస్తూ, అవసరం ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసేలా చూడాలని, రుణాలు పొందేందుకు ఏ దరఖాస్తులు సమర్పించాలి, మొదలగు వివరాలను ఆసక్తి గల వారికి తెలియజేయాలని అన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రాలలో కూడా సదరం క్యాంప్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం లక్షా 50 వేల పైగా వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయని, మరో 15 వేల వరకు పెన్షన్లు జారీ చేయాల్సి ఉంటుందని, ఇందులో డయాలసిస్ పేషెంట్లు కూడా ఉన్నారని, ప్రభుత్వం నుంచి నూతన పెన్షన్ మంజూరు కొరకు ఆదేశాలు వచ్చిన వెంటనే నూతన పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు అనువైన స్థలాలను ఎంపిక చేస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా ఇండ్లు లేని ప్రజలు ఎంతమంది ఉన్నారు, అందులో నిరుపేదలు ఎంతమంది మొదలగు ప్రాథమిక సర్వే నిర్వహించామని కలెక్టర్ వివరించారు. ఉపాధ్యాయుల కొరత లేనందున పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల నాణ్యతను తనిఖీ చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల నుంచి పాలు, ఆయిల్ దుర్వినియోగం అవుతున్నాయని అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలు, రుణాలు మొదలగు అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. పిఎంఎఫ్ఎంఈ ద్వారా గిరిజనులను పారిశ్రామికవేత్త తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశం గురించి తెలియజేస్తూ ఆసక్తి గలవారు అంది పుచ్చుకునేలా చూడాలని అన్నారు.మిల్లుల దగ్గర ధాన్యం నాణ్యతపై ఎటువంటి కొర్రిలు జరగకుండా చూడాలని, రైతులకు ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సదరం సర్టిఫికెట్ల జారీ కోసం ఖమ్మం జిల్లా కేంద్రానికి రావాల్సి ఉందని, ఇది దివ్యాంగులకు చాలా ఇబ్బందిగా ఉందని, నియోజకవర్గం హెడ్ క్వార్టర్ లో కూడా నిర్వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్డు మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. సత్తుపల్లి నుంచి కొవ్వూరు దారి మధ్యలో రైల్వే లైన్ దగ్గర ఆర్.ఓ.బి లేదా అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా బ్రిడ్జి మరమ్మత్తు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, అక్కడ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ఇది అత్యంత ప్రాధాన్యతగా భావించి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. గత 10 సంవత్సరాల కాలంలో పేదలకు ఇండ్లు మంజూరు కాలేదని, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఇసుక తరలింపు అవకాశం కల్పించాలని అన్నారు. స్టీల్ ప్లాంట్ రైల్వే లైన్, ఖమ్మం ఇల్లందు దారిలో రైల్వే లైన్ ఉందని, ఇక్కడ ఆర్.ఓ.బి. లేదా అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామాల్లో గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు మాత్రమే ఉన్నాయని, నూతన విద్యుత్ స్తంభాలు అవసరమున్న చోట వేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు.ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య,శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డి.ఎఫ్.ఓ. సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అయోడిన్ లోపం వల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయి

- **మేడ్చల్ మల్కాజిగిరి ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శోభా రాణి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : అయోడిన్ లోపం వల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయని మేడ్చల్ మల్కాజ్గిరి ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శోభా రాణి అన్నారు. మంగళవారం గ్లోబల్ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా మల్కాజ్గిరి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన ర్యాలీ , సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అయోడిన్ లోపం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ శోభా రాణి మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల గోయిటర్, మానసిక అభివృద్ధి లోపం, గొయిటర్ , హైపోథైరాయిడిజం , క్రెటినిజం , నవజాతి శిశువుల్లో మరియు పిల్లల్లో బుద్ధి లోపాలు, మానసిక అభివృద్ధి లోపం, జన్యుపరమైన లోపాలు, వృద్ధి మందగింపు , వంధ్యత్వం , మూత్రపిండాల సమస్యలు వంటి అనేక వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వచ్చే వారం రోజులలో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, స్కూల్స్ , ఆరోగ్య కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు . అయోడిన్ లోప నివారణలో భాగంగా సరైన ఆహారం తీసుకోవడం, సాధారణమైన ఉప్పు కాకుండా అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించడం వంటి అలవాట్లను ప్రజలు పాటించాలనే అంశాన్ని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డా విజయ నిర్మల , డా వినోద్, లింగాల అక్షయ్ కుమార్, తెరిస్సా , రిపోర్టింగ్ అధికారులు వేణు గోపాల్ , రాము , బాలరాజు , జోసెఫ్ జానకమ్మ, వెంకటేశ్వర్లు , ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## చెవిటి వెంకన్న యాదవ్ కు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

- **బట్టు అంజనేయులు**



ప్రజాస్ఫూర్తి, నాగారం: సూర్యాపేట జిల్లా డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ కు రాష్ట్ర షిప్ అండ్ గోట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇవ్వాలని జాతి యాదవ హక్కుల పోరాట సమితి నాగారం మండల అధ్యక్షులు బట్టు ఆంజనేయులు డిమాండ్ చేశారు. చెవిటి వెంకన్న యాదవ్ గత 40 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీపై అంకిత భావంతో ఎనలేని సేవలను అందించిన కార్పొరేషన్ పదవిని ఇవ్వకపోవడం అనేది యాదవులందరికీ తీవ్ర అన్యాయం చేసినట్లే అని తెలిపారు.



## కాలినడకన ఉద్యమాన్ని నిర్మించాం

* **ఉమ్మడి రాష్ట్ర తొలి మహాసభను విజయవంతం చేశాం**
* **ఐద్వా ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటి కార్యదర్శి ఏలూరు జయమ్మ**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : 1974 సంవత్సరంలో కాలినడకన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక గ్రామాల్లో పర్యటించి మోటూరు ఉదయం ,మల్లు స్వరాజ్యం సహకారంతో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వాకి అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం ఉమ్మడి రాష్ట్ర మొట్టమొదటి మహాసభను ఖమ్మంలో వర్తక సంఘం భవనంలో నిర్వహించామని ఆనాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా ఉద్యమానికి మొట్టమొదటి జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఏలూరు జయమ్మ తెలిపారు. కొత్తగూడెంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా 95 సంవత్సరాల వయసులో ఏలూరు జయమ్మ మహాసభకు హాజరై ప్రతినిధులను ఉత్సాహపరిచే సందేశాన్ని ఇచ్చారు. మహిళలు ఇంటి నుంచి బయటకు రావడానికి అనేక ఆటంకాలు ఉన్న కాలంలో మహిళలను సమీకరించి ఉద్యమాలు చాలా కష్టంతో కూడుకున్న సమయంలో అనేక గ్రామాలకు కాలినడకన వెళ్లి ఉద్యమాల నిర్మించాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. రోజుల తరబడి కుటుంబాన్ని, పిల్లలను వదిలిపెట్టి ఉద్యమ నిర్మాణం కోసం, పోరాటాల కోసం తాను కొండపల్లి దుర్గాదేవి కృషి చేశామని ఏలూరు జయమ్మ తెలిపారు. ఖమ్మం చుట్టూ ఉన్న కారేపల్లి ,ముద్దులపల్లి, గోకినేపల్లి, గ్రామాల్లో పర్యటించి ఉద్యమ నిర్వహణ కోసం, రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం విరాళాలు సేకరించామని గుర్తుచేశారు. సభ్యత్వం చేసి మహిళా హక్కుల కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. మోటూరు ఉదయం, మానుకొండ సూర్యవతి, మల్లు స్వరాజ్యం సహకారంతో ఐద్వా నిర్మాణానికి ఉమ్మడి జిల్లాలో తాము కృషి చేసినట్లు తెలిపారు. ఐద్వాను మరింత బలోపేతం చేయాలని, పోరాటాన్ని ఉధృతం చేయడం ద్వారా మహిళలను అభ్యుదయ భావజాలం వైపు తీసుకురావాలని ప్రతినిధులు పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఖమ్మం ప్రధాన ఆస్పత్రికి అధిక నిధులు తీసుకొస్తా

* **ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**
* **హాస్పిటల్ పరిశీలన, మెడికల్ సూపరింటెండెంట్, వైద్యులతో భేటీ**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం :ఉభయ జిల్లాల ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యం అందించేలా ఖమ్మంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హాస్పిటల్ ను సందర్శించి వార్డులను పరిశీలించారు. పై కప్పు కురుస్తుందని తెలుసుకొని అక్కడికి వెళ్లి చూశారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ చాంబర్లో వైద్యులతో సమావేశమయ్యారు. 570 బెడ్లు ఉండి, రోజుకు 2000 మంది ఓపీ పేషంట్లు వస్తున్నారని ఈ సందర్భంగా వారు ఎంపీకి తెలిపారు. వైద్య విధాన పరిషత్ వైద్య కళాశాల ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేరని వివరించారు. స్పందించిన ఎంపీ రఘు రాం రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, హెల్త్ మినిష్టర్ దృష్టికి తీసుకెళ్లి అధిక నిధులతో అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. హాస్పిటల్ అవసరాల కోసం నాలుగు ఫ్రీజర్లను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అలాగే టీఎస్ఎంఎస్ఐడిసీ సంస్థ ఇంజనీర్ తో ఎంపీ ఫోన్లో మాట్లాడి..త్వరితగతిన మరమ్మతులు చేపట్టి, రోగులకు ఇబ్బంది కలగకుండా పూర్తి చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, చావా శివరామకృష్ణ, నాయకులు మిక్కిలినేని నరేందర్, ఇమామ్ భాయ్ , దుంపల రవి, రామకృష్ణా రెడ్డి, శ్రీఖళా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సురక్షిత,ఆనంద దీపావళి
# జరుపుకునేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ**





ప్రజాస్ఫూర్తి , ఖమ్మం : జిల్లా ప్రజలు సురక్షిత, ఆనందమయ దీపావళి జరుపుకునేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు.మంగళవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో దీపావళి టపాసుల షాపుల ఏర్పాట్లు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 31న జరుపుకునే దీపావళీ పండుగకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. పోలీస్, మునిసిపల్, రెవిన్యూ, పంచాయతీ తదితర శాఖలన్ని సమన్వయంతో పనిచేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్థానిక ఎస్ఆర్, బిజీఎన్ఆర్ కళాశాల మైదానంలో టపాసుల షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. షాపుల ఏర్పాటు అనుమతుల మంజూరు లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. అగ్నిమాపక శాఖ ఎన్ఓసి, మునిసిపల్, గ్రామ పంచాయతీ అనుమతులు ఉండాలన్నారు. షాపులు ప్రేలుడు రహిత సామాగ్రితో తయారయి ఉండాలన్నారు. షాపు షాపుకు కనీసం 3 మీటర్ల దూరం పాటించాలన్నారు. ఎదురెదురుగా షాపుల ఏర్పాటు వుండరాదన్నారు. ఒక క్లస్టర్ లో 50 షాపులకు మించి ఉండకుండా చూడాలన్నారు. నిషేధిత టపాసులు అమ్మకుండా నిఘా పెట్టాలన్నారు. మైదానంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇసుక, వాటర్ ట్యాంకర్లు, ఫైర్ ఇంజన్ల ను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ పనుల్లో లూజ్ వైర్లు, అతుకుల వైర్లు లేకుండా చూడాలని, అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎం లతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, డ్రెస్సింగ్ కిట్స్ అందుబాటులో ఉంచాలని, దీపావళి పండుగ రోజు, స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రజలు ప్రమాదాలు, ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెం. 1077 కు కాల్ చేస్తే, అధికారులు స్పందించి, వెంటనే చర్యలు చేపడతారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఎస్బి ఏసీపీ సాంబరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి బి. అజయ్ కుమార్, ఎస్ఆర్, బిజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. జకీరుల్లా, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. వి. సుబ్బారావు, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమీషనర్ షఫీఉల్లా, మధిర, వైరా మునిసిపల్ కమిషనర్లు సంపత్ కుమార్, వేణు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా మహాత్మా గాంధీ
# గ్లోబల్ శాంతి పురస్కారాలు 2024




హైదరాబాద్, ప్రజా స్ఫూర్తి: శాంతి, మతసామరస్యానికి ప్రతీకైనా హైదరాబాద్ నగరం మనందరికీ ఆదర్శమని తెలంగాణ శాసలమండలి డిప్యూటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ బండ ప్రకాష్ అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హాబిట్స్ లోని బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మా గాంధీ జయంతి, అంతర్జాతీయ అహింసా దినోత్సవ ముగింపు ఉత్సవాలలో పురస్కరించుకొని ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.విద్యార్థి దశ నుండే విద్యార్థులు యువకులు శాంతి మార్గంలో నడిచి దేశ సమైక్యత ,అభివృద్ధికి పాటుపడాలన్నారు. తెలంగాణ శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద గుప్తా మాట్లాడుతూ హింస మార్గం ద్వారా జీవితంలో ఏమీ సాధించలేమని కుల మతాలకు అతీతంగా ఐక్యంగా శాంతియుత జీవనం సాగిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు .హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి చంద్రకుమార్ మాట్లాడుతూ గాంధీ పయనించిన శాంతి, అహింస సద్భావన వంటి అంశాలను అనుసరిస్తే సమాజం అన్ని రంగాల్లో పురోగమిది దశగా వెళుతుందన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర ఉద్యమంలో మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు త్యాగాలపై నేటి యువత విద్యార్థులు అధ్యయనం చేసి దేశాభివృద్ధికి పాటుపడాలని, ఇంటింటికి బీసీ సర్వేల గురించి వచ్చే అధికారులకు సరైన కుటుంబ సభ్యుల వివరాలు అందించాలని అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఇటీవల అమెరికాలో అక్కడి యూనివర్సిటీ ప్రొఫెసర్లు సన్మానించి, అవార్డు పొందిన ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా న్యాయవాది డిఎల్ పాండు, పి .ఉజ్వల్ చందర్, డాక్టర్ రవితేజ, విద్యావేత్త ఎస్ మధుసూదన్ ముదిరాజ్ ,బత్తుల హేమంత్, ఢిల్లీ శివకుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు అందుకున్న వారిలో ఎన్ ఆర్ లక్ష్మణరావు, వి ప్రభాకర్ రావు ఎన్ ఆర్ లక్ష్మణ్ గుప్తా, వి.ప్రభాకర్ రావు ,డాక్టర్ కోడి శ్రీనివాసులు, బండి రాజుల శంకర్, జి విజయలక్ష్మి, డాక్టర్ పి భిన్నబాబు, శ్రీ జి ఎట్టయ్య ,కటకం భాస్కర్ గుప్తా ,డాక్టర్ లంక గంగాధరం కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, వై చంచల ,మహేష్ అగర్వాల్, డాక్టర్ ఎన్ ప్రసాద్, డాక్టర్ జి స్వరూప రాణి, మహమ్మద్ పర్వేజ్ ,ఈ.ముత్యం యాదవ్, డి లక్ష్మణ్ ముదిరాజ్, డి నరేందర్, పి భరత్ రెడ్డి ,తాళ్ల నరేందర్ ,డాక్టర్ జమాన్, వి. రమణమ్మ లకు శాలువా, జ్ఞాపిక పూలమాలతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కూచిపూడి భరతనాట్యం చేసిన నృత్య కళాకారులు కుమారి పొటెల్ వంశిక యాదవ్, కుమారి నయన, చిన్నారి నందలు చేసిన నృత్యం ఆహుతులను అలరించాయి.

## కూనంనేని కృషితో రూ.16.70కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు

* **మారుమూల ప్రాంతాల అభివృద్ధి అహర్నిశలు శ్రమిస్తా : కూనంనేని**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సుదీర్ఘకాలంగా గ్రామీణ, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు గుర్తించి వాటి పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిర్విరామంగా చేస్తున్న కృషికి అనతికాలంలోనే ఫలితాలు లభిస్తున్నాయి. పట్టణంలోని పాతకొత్తగూడెం నుంచి చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి రహదారిలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన కూనంనేని ప్రతిపాదనలు అందించిన ఫలితంగా బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. నణ్యతండా మీదుగా బేతంపూడి నుంచి నల్లవాగు వరకు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణంకోసం రూ.1.80కోట్ల మంజూరి లభించింది, పాల్వంచ మండలంలోని సోములగూడెం రోడ్డు, బ్రిడ్జి నిర్మాణంకోసం రూ.4.00కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలంలో గడ్డిగుట్ట తండా మీదుగా తెలగరామవరం నుంచి పులిగుండం తండా వరకు బిటి రోడ్డు నిర్మాణానికి ఒక కోటి, పాల్వంచ మండలంలో పుల్లాయిగూడెం నుంచి ప్రభాత్ నగర్ వరకు గతంలో రూ.కోటి మంజూరు కాగా మరో రూ.70లక్షలు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని సీతారాంపురం గ్రామం నుంచి రూప్లా తండా రోడ్డులో రూ.1కోటితో బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కృషిచేస్తున్నామని, నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరిన రహదారులు, బ్రిడ్జిల పుననిర్మాణానికి సంబంధిత మంత్రులు, అధికారులకు ప్రతిపాదనలు అందించి నిధులు మంజూరు చేయించడం జరిగిందని, తాజాగా రూ.16.70 కోట్ల సిఆర్ఆర్ నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. మారుమూల పల్లెల అభివృద్ధి, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రతి గ్రామం మెరిసేలా..మురిసేలా అభివృద్ధి చేసి ప్రజల ముందు ఉంచుతామని కూనంనేని స్పష్టం చేశారు.

## పెండింగ్ లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి అధికారులందరూ బాధ్యతగా కృషి చేయాలి

* **నెలవారీ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి అధికారులందరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న పలు కేసులు వివరాలను,వాటి పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు.కొత్త కొత్త టెక్నాలజీలతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల ఖాతాల నుండి నగదు మాయం చేస్తున్నారు.ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి "క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్" ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా బాధ్యతగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలకు అనునిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ వారిని అప్రమత్తం చేయాలని తెలిపారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. గుట్కా,మట్కా,జూదం,బెట్టింగు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని తెలిపారు.రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసుకుని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు.బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు.జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ నివారణాచర్యలు చేపట్టాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదిలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మహిళలు,చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అధికారులందరూ తమ క్రింది స్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు వ్యక్తిగత జీవితంలో , ఉద్యోగ జీవితంలో ఒత్తిడిని తగ్గించుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు.అనంతరం ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్లో ఫింగర్ ప్రింట్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన చంద్రుగొండ ఎస్సై స్వప్నను అభినందించారు. ఈ సమావేశంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు, జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో జయరాజు , సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ దత్తత్రయ నగర్ కాలనీలో రూ.17 లక్షల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, జగదీష్, నాగభూషణం, మల్లేష్, సంతోష్ బిరాదర్, భూమి, నాగేష్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.


## అక్రిడేషన్లతో సంబంధం లేకుండా జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలు కేటాయించాలి

**డి జె ఎఫ్ తిరుమలగిరి మండల అధ్యక్షుడు నీర్మాల బాలకృష్ణ**



తిరుమలగిరి, ప్రజాస్ఫూర్తి : అక్రిడేషన్ల తో సంబంధం లేకుండా జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలు కేటాయించాలని డి జె ఎఫ్ తిరుమలగిరి మండల అధ్యక్షుడు నీర్మాల బాలకృష్ణ అన్నారు. డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (డి జే ఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డి జె ఎఫ్ తిరుమలగిరి మండలాధ్యక్షుడు నీర్మాల బాలకృష్ణ ఆధ్వర్యంలో అక్రిడేషన్లతో సంబంధం లేకుండా, చిన్న పెద్ద అనే తరతమ్యాలు లేకుండా క్షేత్ర స్థాయిలో పనిచేసే జర్నలిస్టులందరి ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించాలని తిరుమలగిరి మండల తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో డి జె ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం డి రెహమాన్ అలీ, జిల్లా నాయకులు ఎస్.కె చాంద్ పాషా , మండల ప్రధాన కార్యదర్శి ఉడుగు సుధాకర్, ఉపాధ్యక్షులు పత్తేపురం విజయ్, గౌరవ అధ్యక్షులు చిలుకల ప్రకాష్, సంతోష్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి, ఛత్ పండుగలకు 804 ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్: దీపావళి, ఛత్ పండుగల(Diwali and Chhat festivals) సందర్భంగా ఆయా ప్రాంతాలకు వెళ్లొచ్చేందు ప్రయాణికుల సౌకర్యార్థం 804 ప్రత్యేక రైళ్లను నడుపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి, ఛత్ పండుగలకు ప్రధానంగా తెలుగు రాష్ట్రాల నుంచి పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, బిహార్(West Bengal, Odisha, Jharkhand, Bihar)తో పాటు ఉత్తరప్రదేశ్, హరి యాణా, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అత్యధికంగా ఉంటుందని రైల్వే అధికారులు వివరించారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రధాన రైల్వే స్టేషన్‌లు సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ(Secunderabad, Hyderabad, Kachiguda) తదితర కేంద్రాల నుంచి షాలిమార్, రక్సాల్, జైపూర్, లాల్‌ఘర్, హిసార్, గోరక్‌పూర్, షిర్డీ, దానాపూర్, నిజాముద్దీన్, కటక్, అగర్తల, సంత్రాగచ్చి తదితర ప్రాంతాలకు అత్యధికంగా రైళ్లను నడుపుతున్నట్టు తెలియజేశారు. ఇతర రాష్ట్రాల్లోని స్టేషన్లకు సైతం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. మధురై, ఈరోడ్, నాగర్‌కోయిల్, కొల్లాం, బెంగళూరు, పన్వేల్, దాదర్(Madurai, Erode, Nagercoil, Kollam, Bangalore, Panvel, Dadar) తదితర ప్రాంతాలకు ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్టు వివరించారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు

**- కాంట్రాక్టర్ల కక్కుర్తితోనేనంటూ ఆగ్రహం**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రభుత్వం పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు చేసి పౌష్టికాహారం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుంటే కొందరు కాంట్రాక్టర్ల కక్కుర్తితో కార్యక్రమంపై మచ్చ పడుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే కోడిగుడ్లు కుళ్లిపోయినవి, పురుగులు పట్టినవి, సైజు తక్కువతో గుడ్లు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టిహాకారం మాటెరుగు... వాటిని తీసుకుంటే అనారోగ్యాల భారీన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇదే క్రమంలో ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 5లో కుళ్లిపోయిన కోడిగుడ్లను పిల్లలకు, గర్భిణులకు పంపిణీ చేశారని వారి కుటుంబ సభ్యులు, గ్రామ యువకులు ఆరోపించారు. దీనిపై కుటుంబ సభ్యులు, గ్రామ యువకులు అంగన్‌వాడీ కేంద్రంకు వచ్చి అంగన్‌వాడీ టీచర్‌ను నిలదీయగా, ఈ నెల 19న గుడ్లు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చాయని, ఆ రోజు నుంచే తాను గుడ్లను పంపిణీ చేస్తున్నానని సమాధానం ఇచ్చారు. గుడ్లు వచ్చిన మూడు రోజులకు ఎలా కుళ్లిపోతాయని ఈ విషయంపై అంగన్‌వాడీ సూపర్ వైజర్ అంజలిని ప్రశ్నించగా, అంగన్ సెంటర్‌కు గుడ్లను సరఫరా చేసే ఏజెన్సీపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ యువకుడు కోల కృష్ణ మాట్లాడుతూ గుడ్లు వచ్చిన 3 రోజులకే కుళ్ళిపోవడం, పురుగులు రావడం ఏంటని, 40 నుండి 50 గ్రాములు ఉండాల్సిన కోడి గుడ్డు 20 గ్రాముల, అంతకంటే చిన్న సైజులో ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మండలంలోని కొన్ని సెంటర్లలో కూడా ఇలాగే కూల్లిన కోడిగుడ్లు వచ్చాయని, వీటిపై అధికారులు దృష్టి సారించి గుడ్లు పంపిణీ చేసే ఏజెన్సీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిట్టు రాజేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకోవాలి



* **ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై సింగరేణి యాజమాన్యం తక్షణమే నిర్ణయం తీసుకొని అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కిష్టాఫర్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం కార్పోరేట్ పరిధిలోని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి మేరకు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చేసిన కృషి వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచడానికి ఈనెల 7న స్పష్టమైన హామీని ఇవ్వడం జరిగిందని, పర్మినెంట్ కార్మికుల వేతనాలకు కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలకు మధ్య గల వ్యత్యాసాన్ని తగ్గించడానికి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని తీసుకున్న నిర్ణయం పట్ల సింగరేణి యాజమాన్యం జాప్యం చేయకుండా తక్షణమే నిర్ణయించాలని నాయకులు కోరారు. పెండింగులో ఉన్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రాబోయే కాలంలో సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిర్వహించే పోరాటాలకు కాంట్రాక్ట్ కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంజిత్, రాజు, చుక్కయ్య, ఆదిలక్ష్మి, సుజాత, విమలమ్మ, వెంకటేశ్వర్లు, రాము, అన్వర్, విష్ణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## లింకు రోడ్ల అభివృద్ధితో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది



* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : లింకు రోడ్ల అభివృద్ధితో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు దూరం తగ్గుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని లింకు రోడ్ల పనులపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ ఆర్ డి సి ఎల్), జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్.హెచ్ 44 నుంచి ఫాక్స్ సాగర్ మీదుగా రాంరెడ్డి నగర్ ఇండస్ట్రియల్ ఏరియా వరకు 29 కోట్లతో, కైసర్ నగర్ హనుమాన్ టెంపుల్ నుంచి గాజులరామారం మిథిలా నగర్ వరకు 36 కోట్లతో, ప్రగతి నగర్ నుంచి ఎల్లమ్మ బండమీదుగా మహాదేవపురం వెటర్నరీ హాస్పిటల్ వరకు 30 కోట్ల రూపాయలతో లింకు రోడ్డు పనులను చేపట్టనుండగా అదేవిధంగా భూదేవి హిల్స్ లింకు రోడ్డు పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లింక్ రోడ్డు పనుల అభివృద్ధిపై అధికారులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎవ్వరికీ అసౌకర్యం కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసిపి సురేందర్ రెడ్డి, టిపిఎస్ రమేష్, న్యాక్ ఇంజనీర్ జయశ్రీ , విజయ్ కుమార్, విట్టలయ్య, హెచ్ఆర్డి సిఎల్ అధికారులు జెరెమయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ చాలా కీలకమైనది

**ప్రతి విద్యార్థి చదువు పైన దృష్టి సారించాలి**

**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే**





రాజాపేట, ప్రజాస్ఫూర్తి : విద్యార్థి దశ కీలకమైందని, ప్రతి ఒక్కరూ విద్య పై దృష్టి సారించాలని అందుకు ప్రతి ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండాగే అన్నారు.

మంగళవారం రోజున రాజపేట మండలం పాముకుంట గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , కాషాగూడెం లోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ పాఠశాలలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు.పాఠశాల లోని మౌళిక వసతుల ఏర్పాట్లు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పాఠశాల పరిధిలో నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలన్నారు. పరిసర ప్రాంతాలలో ఉన్న పిచ్చి మొక్కలను తీసి వేయాలన్నారు . పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని ఆరవ, నాలువ తరగతి చదు వుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసాన సామర్థ్యాలను పరీక్షించారు. హిందీ పాఠ్య పుస్తకం లో ని పేరా ని పిల్లలతో చదివించారు. పాఠశాలలో చదువుకునే పిల్లల అందరికి స్కూల్ యూనిఫామ్ అందిచడం జరిగిందా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మంచి రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఉపాధ్యాయుల సంఖ్య వివరాలను ఎంఈఓ చందా రమేష్ ద్వారా అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలల నిర్వహణ పట్ల, ఎంఈఓ చందా రమేష్ పర్యవేక్షణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కాషాగూడెం లోని అంగన్వాడీ సెంటర్ ను సందర్శించి పిల్లల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి,బియ్యం, పాల పాకెట్స్, కోడిగుడ్ల నిల్వ లను , పరిశీలించారు. అంగన్ వాడి కేంద్రానికి ప్రతి పిల్లలు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా అంగన్వాడీ టీచర్ చూడాలన్నారు.పూర్వ ప్రాథమిక విద్య వర్క్ బుక్ ను పరిశీలించి, చిన్నారుతో ముచ్చటించారు.బాల్య దశ లోనే చిన్నారులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా విద్య ను అందించాలన్నారు. పౌష్టిక ఆహారం లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు.కేంద్రంలోని పిల్లలకు ఆట, పాటలు నేర్పించాలన్నారు. మంచి విద్యా బుద్ధులు నేర్పించాలని అంగన్వాడీ టీచర్ కు సూచనలు చేశారు. అంగన్ వాడి కేంద్రం లోని బాలింతలకు , గర్భిణీలకు , పౌష్టిక ఆహారం అందిస్తున్నారా కలెక్టర్ అని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దామోదర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని నాగవేణి , మండల విద్యాధికారి చందా రమేష్, అంగన్వాడీ టీచర్ కృష్ణవేణి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ముంబయి వీధుల్లో ఈశా, ఆకాశ్ అంబానీ నైట్ రైడ్

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

**నేషనల్ బ్యూరో:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ కూతురు ఈశా అంబానీ, కుమారుడు ఆకాశ్ అంబానీ ముంబై విధుల్లో ఖరీదైన రోల్స్ రాయిస్ ఓపెన్ టాప్ కారులో తిరిగారు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆకాశ్ రోల్స్ రాయిస్‌ను నడుపుతుండగా.. ఆయన పక్కనే ఈశా కూర్చున్నారు. వెనక సీట్లో శ్లోకా ఉన్నారు. రాత్రి వేళ అంబానీలు సరదాగా రైడ్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. వారి కారు వెనకే భద్రతా సిబ్బంది ప్రయాణించారు. ఈ వీడియోపై స్పందించిన నెటిజన్లు కామెంట్లు చేశారు. 'సామాన్యుల వలే వారికీ ఎంజాయ్ చేయాలని ఉంటుంది'.. 'కుటుంబంతో జాలీ రైడ్.. వాట్ ఏ మూమెంట్' అంటూ కామెంట్లు చేశారు. కాగా.. ఇటీవల ముకేశ్ అంబానీ చిన్న కోడలు రాధికా మర్చంట్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి.

# జనవరి నాటికి బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు

- రాష్ట్రాలకు మారనున్న అధ్యక్షులు
- బూత్ కమిటీల నుంచి ప్రారంభించి..
- రాష్ట్రస్థాయి.. జాతీయ స్థాయికి ఎన్నికలు



**నేషనల్ బ్యూరో:** భారతీయ జనతా పార్టీ జాతీయ స్థా యిలో భారీ మార్పులు చేయబోతున్నట్టు తెలుస్తోంది. జనవరి నాటికి బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయబోతున్నారు. అంతేకాక వివిధ రాష్ట్రాలకు కూడా అధ్యక్షులను మర్చబోతున్నారు. బూత్ కమిటీల నుంచి ప్రారంభించి రాష్ట్రస్థాయి.. జాతీయ స్థాయికి ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు సమాచారం. పార్టీ సంస్థాగత ఎన్నికల కసరత్తును బీజేపీ ప్రారంభించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో జాతీయ అధ్యక్షుడితో పాటు కొన్ని రాష్ట్రాల అధ్యక్షుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ పార్టీ తీర్మానం చేసింది. ఇప్పుడు బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియకు లోబడే మార్పులు చేర్పులు జరగనున్నాయి. బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ను ఎంపిక చేశారు. బూత్ కమిటీల నుంచి ప్రారంభం చేసి రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి ఎన్నికలను నిర్వహించనున్నారు. పార్టీ కొత్త కమిటీల ఎన్నికల్లో క్రియాశీలక సభ్యులదే కీలకపాత్ర. మూడు నెలల్లో బీజేపీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయనున్నారు. ఇక, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి.

**అంతర్గత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఎన్నికలు**

బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఎన్నికలు జరుగుతాయని లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే తమది అతిపెద్ద రాజకీయ పార్టీ అని చెప్పారు. బూత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎన్నికల ప్రక్రియ జరగనున్నదని చెప్పారు. బూత్ కమిటీల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది.. దేశవ్యాప్తంగా 10 లక్షల బూతులకు ఎన్నిక జరగనుంది అన్నారు. ప్రతి బూతు కమిటీలో అధ్యక్షుడితో పాటు 11 మంది సభ్యులు ఉంటారు. అన్ని రాష్ట్రాల రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తైంది.. ఒక సామాన్య కార్యకర్తగా వచ్చిన నన్ను ఎలక్షన్ రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నామని డాక్టర్ లక్ష్మణ్ చెప్పారు. ఇక, పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం జాతీయస్థాయి వర్క్ షాప్ పూర్తైందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాష్ట్రాల వర్క్ షాప్స్ 25 అక్టోబర్ లోపల నిర్వహిస్తాం.. నవంబర్ 5వ తేదీ వరకు జిల్లాల్లో వర్క్ షాపులు జరుగుతాయి.. నవంబర్ 15 లోపల బూత్ కమిటీల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. క్రియాశీలక సభ్యత్వం లేకపోతే పార్టీలో బాధ్యతలు ఇవ్వరు.. బీజేపీ ఒక కుటుంబ పార్టీ కాదు ఒక వర్గం పార్టీ కాదు అని తెలిపారు.

# డ్రోన్ టెక్నాలజీ .. గేమ్ చేంజర్

- ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో భారతీయులు సమర్థులు
- ఆ రోజుల్లో పీపీపీ పద్ధతుల్లో హైటెక్ సిటీ నిర్మించాం
- కొన్ని దేశాలు యుద్ధాల్లోనూ డ్రోన్లు వాడుతున్నాయి
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



**తెలంగాణ బ్యూరో:** భవిష్యత్ లో డ్రోన్ టెక్నాలజీ గేమ్ చేంజర్ గా మారబోతున్నదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో భారతీయులు సమర్థులని చెప్పారు. విజయవాడ వరదల్లోనూ తాము డ్రోన్ టెక్నాలజీని వాడుకున్నామని చెప్పారు. కొన్ని దేశాలు యుద్ధాల్లోనూ డ్రోన్లను వాడుతున్నాయని చెప్పారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో భారతీయులు చాలా సమర్థులని సీఎం కొనియాడారు. 1995లో తొలిసారి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేశానని.. ఆరోజుల్లోనే పీపీపీ పద్ధతిలో హైటెక్ సిటీని నిర్మించామన్నారు. అమెరికా వెళ్లి 15 రోజులపాటు అనేక సంస్థల ప్రతినిధులను కలిసినట్లు గుర్తు చేసుకున్నారు. నివాస అనుకూల నగరాల్లో దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్ అని చెప్పారు. విదేశాల్లో ఉన్న మనదేశ ఐటీ నిపుణుల్లో 30 శాతం తెలుగువారే ఉన్నారని చెప్పారు. 'ఇప్పుడు నిజమైన సంపద డేటా. భవిష్యత్తులో దేశానికైనా, కంపెనీకైనా అదే కీలకం. డేటాకు ఏఐను అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి ఆహారం, తాగునీరు అందించాం. వ్యవసాయం, మౌలిక వసతుల రంగంలో వాటిది కీలకపాత్ర. నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు వాడొచ్చు. భవిష్యత్తులో వైద్యరంగంలో పెనుమార్పులు రానున్నాయి. రోగులు ఇంటివద్దే ఉండి చికిత్స తీసుకోవచ్చు. కొన్ని దేశాలు యుద్ధాల్లో డ్రోన్లు వాడుతున్నాయి. మేం మాత్రం అభివృద్ధికి ఉపయోగిస్తాం. శాంతిభద్రతల పరిరక్షణకు వినియోగిస్తాం. పోలీసుశాఖలో విస్తృతంగా ఉపయోగించేందుకు కృషి చేస్తాం. డ్రోన్లతో రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి వారికి చెక్ పెడతాం' అని చంద్రబాబు తెలిపారు.

# పౌరసేవలు.. మరింత ఈజీ

- మెటాతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం
- యువగళం హామీలు నెరవేరుస్తున్నా
- మెటాతో ఒప్పందం చారిత్రాత్మకం
- ఐటీ మంత్రి నారా లోకేశ్



**ఏపీ బ్యూరో:** పౌరసేవలు ఏపీ ప్ర జలకు మరింత ఈజీ కానున్నాయని ఐటీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మెటాతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నదన్నారు. ఈ సందర్భంగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. యువగళం హామీలు నెరవేర్చడంలో మెటాతో ఎంవోయూ చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. 'విద్యార్థులు, నిరుద్యోగులు వివిధ సర్టిఫికెట్ల కోసం పడుతున్న కష్టాలు యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రత్యక్షంగా చూశా. మొబైల్ ద్వారానే ఆయా సర్టిఫికెట్లు అందిస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చా. ఇచ్చిన హామీ మేరకు వాట్సప్ ద్వారానే వివిధ రకాల సర్టిఫికెట్లు, పౌరసేవలు అందించేలా మెటాతో ఒప్పందం చేసుకున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు ఆన్‌లైన్‌లో అతి సులువుగా, పారదర్శకంగా, అతి వేగంగా పొందే ఏర్పాట్లు చేస్తాం.' అని మంత్రి లోకేశ్ తెలిపారు. మెటాలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను వినియోగించుకుని వాట్సప్ ద్వారా ఏపీ ప్రజలకు పౌర సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్ తెలిపారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఉందా?

- ప్రత్యర్థి పార్టీలను వేధించేందుకే పోలీసులు
- వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల



**ఏపీ బ్యూరో:** రాష్ట్రంలో అసలు మహిళలకు రక్షణ ఉందా? అని వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల ప్రశ్నించారు. ప్రత్యర్థి పార్టీలను వేధించేందుకు పోలీసులు ఉన్నారని చెప్పారు. మంగళవారం ఆమె తాడేపల్లిలో మీడియాతో మాట్లా డారు. కూటమి పాలనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అఘాయిత్యాలను అరికట్టడంలో కూటమి సర్కార్ విఫలమైంది. ప్రభుత్వ పెద్దలకు కనీస సామాజిక బాధ్యత లేదు. ఏపీలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయింది. కూటమి పాలనలో మహిళల మాన ప్రాణాలకు విలువే లేదు. చీకటికాలంగా మారింది. ప్రతిరోజూ ఏదో ఒకచోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. నేరస్తులకు అంత ధైర్యం ఎక్కడ నుండి వస్తోంది?. మహిళల కోసం ప్రభుత్వం ఏమీ చేయటం లేదు. ప్రత్యర్థి పార్టీలను వేధించటానికే పోలీసులను వాడుకుంటున్నారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా సీఎం చంద్రబాబుకు కాస్త కూడా బాధ లేదు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వేధింపులు తట్టుకోలేక బాధిత మహిళ పక్క రాష్ట్రం వెళ్లి ప్రెస్‌మీట్ పెట్టింది. పిఠాపురంలో మహిళ అత్యాచారానికి గురైతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు పరామర్శించలేదు?. హిందూపురంలో అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్ జరిగితే బాలకృష్ణ ఎందుకు పట్టించుకోలేదు? ఆయనకు బాధ్యత లేదా?' అంటూ పేర్కొన్నారు.



## సారీ చెప్పను..

- సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నాను
- తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్

**నేషనల్ బ్యూరో:** సనాతన ధర్మంపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. తాను క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదన్నారు. సనాతన ధర్మం మలేరియా, డెంగీ వంటిదని, దాన్ని నిర్మూలించాలని గతంలో స్టాలిన్ చేసిన కామెంట్లు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న తన పిలుపుపై క్షమాపణలు చెప్పబోనని స్పష్టం చేశారు. సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడారు. ఇందుకు సంబంధించిన కామెంట్లు తాజాగా వైరల్ అయ్యాయి. మహిళలపై జరిగిన అణచివేత పద్ధతులను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ వ్యాఖ్యలు చేసినట్లు వివరణ ఇచ్చుకున్నారు. సనాతన ధర్మంపై తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. ఆ విషయంలో ఎవరికీ క్షమాపణ చెప్పేది లేదని మరోసారి క్లారిటీ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలపై న్యాయ పోరాటానికి కూడా సిద్ధమని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు.

# బిష్ణోయ్ ను ఎన్ కౌంటర్ చేస్తే రూ. కోటి బహుమతి

- క్షత్రియ కర్ణి సేన
- ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజ్
- షెకావత్ వీడియో



**నేషనల్ బ్యూరో:** ప్రస్తుతం గ్యాంగ్ స్టర్ బిష్ణోయ్ పేరు దేశవ్యాప్తంగా మారు మోగిపోతున్న విషయం తెలిసిందే. సిద్ధిఖీ హత్య అనంతరం ఎక్కడ చూసినా బిష్ణోయ్ పేరే వినిపిస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా క్షత్రియ కర్ణి సేన సంచలన ప్రకటన చేసింది. జైల్లో ఉన్న గ్యాంగ్ స్టర్ బిష్ణోయ్ ని ఎన్ కౌంటర్ చేస్తే రూ. కోటి నజరానా ఇస్తామంటూ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజ్ షెకావత్ వీడియో విడుదల చేశాడు. 'లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేసిన ఏ పోలీసు అధికారికైనా వారి భద్రత, కుటుంబ భవిష్యత్తు కోసం రూ. కోటికి పైగా ఇస్తాము. ఈ గ్యాంగ్ ఎన్ని హత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. మా అధినేత సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడిని చంపిన వారిని వదిలేది లేదు'' అని రాజ్ షెకావత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. 2023, డిసెంబర్‌లో రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గోగామేడీని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. అనంతరం ఆయనను తామే హత్య చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. దీంతో తాజాగా క్షత్రియ కర్ణి సేన ఈ మేరకు ప్రకటన విడుదల చేయడం గమనార్హం .



## ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ప్రైవేట్ బస్సు డ్రైవర్ల దాడి

- దారి ఇవ్వకపోవడమే కారణం

**నేషనల్ బ్యూరో:** ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై ప్రైవేటు బస్సు డ్రైవర్లు దాడికి తెగబడ్డారు. దారి ఇవ్వకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రకాశం జిల్లా పొదిలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సత్తార్ పై సోమవారం రాత్రి కురిచేడు వద్ద దాడి జరిగింది. అతడిని ప్రైవేటు బస్సుల డ్రైవర్లు దారుణంగా కొట్టారు. ప్రైవేటు బస్సులకు ఆర్టీసీ బస్సు దారి ఇవ్వలేదని దాడికి పాల్పడ్డారు. ఆర్డీసీ బస్సు హైదరాబాద్ వెళ్తుండగా వినుకొండ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దాడిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనకు నిరసనగా పొదిలి బస్టాండ్ వద్ద ప్రైవేటు బస్సులను ఆపి ఆర్టీసీ డ్రైవర్లు ఆందోళనకు దిగారు.

# విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానం చేయండి

- కేంద్రమంత్రి ఖట్టర్ కు మంత్రి నారాయణ విజ్ఞప్తి
- గత ప్రభుత్వ హయంలో టెండర్ల వరకు ప్రక్రియ



**ఏపీ బ్యూరో:** విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానం చేయాలంటూ మంత్రి నారాయణ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం కేంద్రమంత్రి ఖట్టర్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపై కీలకంగా చర్చించారు. విజయవాడ మెట్రోను అమరావతికి అనుసంధానం చేయాలని మంత్రి నారాయణ ప్రతిపాదించారు. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపినట్టు కేంద్రమంత్రి ఖట్టర్ దృష్టికి తెచ్చారు. అమృత్ పథకం అమలుపై కూడా కీలక చర్చ జరిగింది. మెట్రో ప్రాజెక్టులపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఖట్టర్ చెప్పినట్టు సమాచారం. గత టీడీపీ ప్రభుత్వంలో విజయవాడ మెట్రో ప్రాజెక్టు టెండర్ల వరకు వెళ్లింది. తర్వాత ప్రభుత్వం మారడంతో మెట్రో ప్రాజెక్టును పక్కన పెట్టేశారు. భూసేకరణనూ గత ప్రభుత్వం ఉపసంహరించింది. తాజాగా కూటమి ప్రభుత్వ రాకతో మెట్రో ఎండీగా ఎన్‌పీ రామకృష్ణారెడ్డిని నియమించారు.

# మరో 10 ఇండిగో విమానాలకు బెదిరింపులు



**నేషనల్ బ్యూరో:** భారత్‌కు చెందిన విమానాలకు వరుస బాంబు బెదిరింపులు ప్రజల్లో ఆందోళన సృష్టిస్తున్నాయి. విమానయాన సంస్థలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా.. ఇవి ఆగడం లేదు. కాగా మంగళవారం మరో 10 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లుగా ఇండిగో ఎయిర్‌లైన్స్ అధికారులు వెల్లడించారు. దేశీయ సర్వీసులే కాకుండా జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ లాంటి అంతర్జాతీయ సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ఇవి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వారంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు మొత్తం 100కు పైగా హెచ్చరికలు వచ్చాయని తెలిపారు. ''జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే విమానాలకు మంగళవారం బాంబు బెదిరింపులు రావడంతో మా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. ప్రయాణికులను తరలించి.. తనిఖీలు నిర్వహిస్తున్నాము'' అని ఇండిగో ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

# ఏపీలో పలుచోట్ల డిస్టిలరీల్లో సీఐడీ తనిఖీలు



**ఏపీ బ్యూరో:** ఏపీలో పలుచోట్ల డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో ఉన్న ఎస్వీఆర్ డిస్టిలరీస్‌పై దాడులు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని విశాఖ, జీఎస్పీ డిస్టిలరీస్‌లో తనిఖీలు చేపట్టారు. ప్రకాశం జిల్లా సింగారయకొండ మండలం పాత సింగరాయకొండ పరిధిలోని పెరల్ డిస్టిలరీని అధికారులు తనిఖీలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లి సెంటనీ బయోటెక్ కర్మాగారంలో మద్యం బాటిలింగ్ యూనిట్‌లో సీఐడీ అధికారుల సోదాలు నిర్వహించారు. మరోవైపు నంద్యాలలో ఎస్పీవై అగ్రో ఇండస్ట్రీస్‌ను సీఐడీ అధికారులు పరిశీలించారు. సంస్థపై పలు ఆరోపణలు రావడంతో సీఐడీ అదనపు ఎస్పీ హుస్సేన్ పీర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సుమారు 30 మంది అధికారులు పాల్గొన్నారు. కడప శివారులోని ఈగల్ డిస్టిలరీ కేంద్రంలో సీఐడీ సోదాలు కొనసాగుతున్నాయి. తిరుపతి నుంచి వచ్చిన సీఐడీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఏడాది నుంచి ఈ కేంద్రంలో ఎంత మొత్తంలో మద్యం తయారు చేశారనేదానిపై రికార్డులు పరిశీలిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం లోని డిస్టిలరీ పరిశ్రమలో కూడా సీఐడీ సోదాలు కొనసాగుతున్నాయి

# టారిఫ్‌ల పెంపు లేదు.. కొత్త లోగో.. 7 కొత్త ఫీచర్లు

**న్యూఢిల్లీ:** మొబైల్ టారిఫ్‌లకు సంబంధించి ప్రభుత్వరంగ నెట్‌వర్క్ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కీలక ప్రకటన చేసింది. సమీప భవిష్యత్తులో టారిఫ్‌లు పెంచే ప్రణాళిక లేదని తెలిపింది.

రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రైవేట్ ఆపరేటర్లు ఇటీవల టారిఫ్‌లను పెంచిన నేపథ్యంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఈ విధంగా స్పందించింది.

'సమీప భవిష్యత్తులో టారిఫ్‌లను పెంచడం లేదని స్పష్టంగా చెబుతున్నాం" అని బీఎస్‌ఎన్‌ఎల్ ఛైర్మన్, ఎండీ రాబర్ట్ రవి పేర్కొన్నారు. దిల్లీలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. వినియోగదారుల సంతోషం, వారి విశ్వాసాన్ని గెలుచుకోవడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ క్రమంలో సమీప భవిష్యత్తులో టారిఫ్‌లను పెంచాల్సిన అవసరం కనిపించడం లేదన్నారు.

### లోగో మారింది..

ఇక, వేగవంతమైన 5జీ సేవలను అందించేందుకు సిద్ధమవుతున్న బీఎస్‌ఎన్‌ఎల్ తాజాగా కంపెనీ లోగోను మార్చింది గతంలో వృత్తాకారంలోని ఊదా రంగు లోగోపై నీలం, ఎరుపు వర్ణంలో ఇంటర్నెట్ కనెక్టివిటీ చిహ్నాలు ఉండగా.. తాజాగా దీనికి మార్పులు చేశారు. కాషాయ రంగు వృత్తాకారం మధ్యలో భారత చిత్రపటాన్ని ఉంచారు. దానిపై తెలుపు, ఆకుపచ్చ వర్ణంలో కనెక్టివిటీ సింబల్స్‌ను ఉంచారు.

### స్పామ్ బ్లాకర్స్, సిమ్ కియోస్క్‌లు..

ఈ సందర్భంగా ఏడు కొత్త సర్వీసులను కూడా బీఎస్‌ఎన్‌ఎల్ మంగళవారం ప్రారంభించింది. వీటిని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా విడుదల చేశారు.

**స్పామ్ బ్లాకర్స్:** స్పామ్ రహిత నెట్‌వర్క్‌ను అందించేందుకు కొత్త వ్యవస్థను తీసుకొస్తోంది. మోసపూరిత ఎస్‌ఎంఎస్‌లు, ఫిషింగ్ కాల్స్‌ను ముందే గుర్తించి ఆటోమేటిక్‌గా వాటిని బ్లాక్ చేయనుంది.

**వైఫై రోమింగ్:** బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్లు ఏ ఎఫ్‌టీటీహెచ్ వైఫైకైనా కనెక్ట్ చేసుకునే సదుపాయం

**ఐఎఫ్‌టీవీ:** ఫైబర్ ఆధారిత ఇంటర్నెట్ లైవ్ టీవీ సర్వీసులను తీసుకొస్తోంది. దీంతో ఎఫ్‌టీటీహెచ్ యూజర్లకు 500 వరకు ప్రీమియం ఛానళ్లను అందించనుంది.

**ఏనీ టైమ్ సిమ్ కియోస్క్‌లు:** సిమ్ విక్రయాలు, యాక్టివేషన్, కేవైసీ ఇంటిగ్రేషన్ కోసం కేంద్రాలను ఏర్పాటు చేయనుంది.

**డైరెక్ట్ టు డివైజ్ సర్వీస్:** ఎక్కడి నుంచి ఎస్‌ఎంఎస్ సేవలను అందించేలా శాటిలైట్ టు డివైజ్ కనెక్టివిటీ సేవలను అందించనుంది.

**పబ్లిక్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ రిలీఫ్:** రియల్ టైమ్ డిజాస్టర్ రెస్పాన్స్, కమ్యూనికేషన్, పబ్లిక్ సేఫ్టీ ఫీచర్లతో భద్రతమైన నెట్‌వర్క్‌ను అందించనుంది.

**గనుల్లో ప్రయివేటు 5జీ:** మైనింగ్ రంగంలోని కార్యకలాపాల కోసం 5జీ టెక్నాలజీ సేవలు.

# సెబీ బాస్‌పై ఆరోపణలు.. మాధబి పురీకి కేంద్రం క్లీన్ చిట్..!





**న్యూఢిల్లీ:** వరుస వివాదాల్లో చిక్కుకున్న సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఛైర్‌పర్సన్ మాధబి పురి బుచ్‌కు ఉపశమనం లభించింది. సెబీ చీఫ్ హోదాలో ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారంటూ వచ్చిన ఆరోపణల వ్యవహారంలో కేంద్రం ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది.

ఈ ఆరోపణల వ్యవహారంపై పార్లమెంటరీ ప్రజా పద్దుల కమిటీ ఇటీవల చేపట్టిన దర్యాప్తు ముగిసింది. అయితే, మాధబి గానీ, ఆమె కుటుంబ సభ్యులు గానీ తప్పు చేసినట్లుగా దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదని సదరు వర్గాలు చెప్పినట్లు సమాచారం. అందువల్ల వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని, మాధబి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని కేంద్రం పేర్కొన్నట్లు తెలుస్తోంది.

అదానీ గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ కంపెనీల్లో మాధబి పెట్టుబడులు పెట్టారని గతంలో హిండెన్‌బర్గ్ చేసిన పోస్ట్ సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆమెపై మరిన్ని ఆరోపణలు వచ్చాయి. సెబీ ఛైర్‌పర్సన్ హోదాలో ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారని, ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వేతనం అందుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అంతేగాక, తన కన్సల్టెన్సీ సంస్థ అగోరా అడ్వైజరీ ప్రైవేటు లిమిటెడ్‌తో సెబీకి సంబంధాలున్నాయని ఆరోపణలు చేసింది.

# ఇండెక్స్‌లు 'బేర్' చూపులు.. నష్టాల్లో ముగిసిన స్టాక్స్..!

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బీఎస్‌ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్‌ఎస్‌ఈ -50 సూచీ నిఫ్టీ మంగళవారం తీవ్ర నష్టాలతో ముగిశాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు బీఎస్‌ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్‌ఎస్‌ఈ -50 సూచీ నిఫ్టీ మంగళవారం తీవ్ర నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కో శాతం చొప్పున పతనం అయ్యాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 930.55 పాయింట్ల పతనంతో 80,220.72 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 24,472 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడే ట్రేడింగ్ లో సెన్సెక్స్ 1001.74 పాయింట్ల వరకూ పతనమైంది.



బీఎస్‌ఈ సెన్సెక్స్ లో కేవలం మూడే మూడు స్టాక్స్ ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్ మాత్రమే లాభ పడ్డాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, టాటా స్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, మారుతి సుజుకి తదితర స్టాక్స్ నష్టపోయాయి. ఇక ఎన్‌ఎస్‌ఈ సూచీ నిఫ్టీ-50లో కేవలం తొమ్మిది స్టాక్స్ మాత్రమే లాభ పడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా,అల్ట్రాటెక్ సిమెంట్ తదితర స్టాక్స్ పుంజుకున్నాయి. మరోవైపు అదానీ ఎంటర్ ప్రైజెస్, బీఈఎల్, కోల్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ నష్టపోయాయి.




# ఒలింపిక్స్‌లో క్రికెట్..

## న్యూయార్క్‌లో మ్యాచ్‌లు..?




**న్యూయార్క్:** విశ్వ క్రీడల్లో క్రికెట్ పునరాగమనానికి ఇంకా నాలుగేండ్లు ఉంది. దాదాపు 36 ఏండ్ల తర్వాత మళ్లీ ఒలింపిక్స్‌లో క్రికెట్ ఫీవర్‌తో అభిమానులను ఊగిపోనున్నారు. అమెరికాలోని లాస్ ఏంజెల్స్ వేదికగా 2028లో జరుగబోయే పోటీల్లో క్రికెట్ నిర్వహణకు అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. అయితే.. ఏ మైదానంలో మ్యాచ్‌లు ఆడిస్తారు? అనేది గందరగోళంగా మారింది. ప్రధాన వేదికైన క్యాలీఫోర్నియా పశ్చిమ తీరంలో ఉంది. అందుని తూర్పు తీరంలో ఉన్న న్యూయార్క్‌లో క్రికెట్ మ్యాచ్‌లకు ఆదరణ ఎక్కువని, అక్కడే ఆడించాలని నిర్వాహకులు ఆలోచిస్తున్నారు.

ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు ఎక్కడ నిర్వహించాలి? అనే విషయమై చర్చిస్తున్నాం అని లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ ప్రధాన అధికారి క్యాసే వసెర్‌మన్ ఓ ప్రకటనలో తెలిపాడు. అంతేకాదు లాస్ ఏంజెల్స్‌కు, భారత కాలమానానికి దాదాపు 12 గంటల 30 నిమిషాల తేడా ఉంటుంది. ఇక్కడ రాత్రి 8 గంటలకు క్రికెట్ మ్యాచ్‌లు ఆడిస్తే.. భారత్‌లోని అభిమానులు ఉదయం 8 గంటలకు లైవ్ చూసే వీలుంది. అలాకాకుండా న్యూయార్క్‌లో సమయం అంతరం ఇండియాకు 9 గంటల 30 నిమిషాలు ముందు ఉంటుంది. అందుకని భారత అభిమానులు సౌకర్యంగా మ్యాచ్‌లు చూడొచ్చు.

ఉదయం 10:30 నుంచి 11 గంటల మధ్య మ్యాచ్‌లు నిర్వహిస్తే.. ఇండియాలో రాత్రి 8 గంటలకు లైవ్ చూసే అవకాశం ఉంటుంది. అందుకని న్యూయార్క్‌లోనే క్రికెట్ మ్యాచ్‌లు జరపాలని అమెరికా ఒలింపిక్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది టీ20 వరల్డ్ కప్ లీగ్ దశ మ్యాచ్‌లు న్యూయార్క్‌లో ఎంత అధ్వాన్నంగా సాగాయో చూశాం. అందుకని 'మళ్లీ అవే కృత్రిమ పిచ్‌ల మీద ఒలింపిక్ మ్యాచ్‌లా?' అంటూ అభిమానులు




పెదవి విరుస్తున్నారు.

### ఊహించని బౌన్స్..

వరల్డ్ కప్‌లో ఆతిథ్య దేశం అమెరికాతో పాటు టీమిండియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ లీగ్ మ్యాచ్‌లు న్యూయార్క్‌లోని నస్సౌ క్రికెట్ స్టేడియంలో జరిగాయి. ఊహించని బౌన్స్‌తో కూడిన ఆ పిచ్ మీద బ్యాటర్లు తడబడగా.. బౌలర్లు పెట్రేగిపోయారు. అసలు టీ20 మజానే లేకుండా స్వల్ప స్కోర్లు నమోదు కావడంతో.. 'ఇదేం పిచ్‌రా బాబూ' అని క్రికెట్ విశ్లేషకులు అమెరికా క్రికెట్ బోర్డుపై మండిపడిన విషయం తెలిసిందే.

# అధిక బరువు, క్రమశిక్షణారాహిత్యం.. ముంబై రంజీ జట్టు నుంచి పృథ్వీ షా ఔట్



**ముంబై:** ముంబై క్రికెటర్ పృథ్వీ షా కెరీర్ అగాధంలో పడింది. అతన్ని ముంబై రంజీ ట్రోఫీ బృందం నుంచి తప్పించారు. అగర్తలాలో అక్టోబర్ 26వ తేదీ నుంచి త్రిపుర జట్టులో మ్యాచ్ జరగాల్సి ఉన్నది. అయితే ఫిట్‌నెస్, క్రమశిక్షణా చర్యల కింద అతన్ని జట్టు నుంచి తప్పించినట్లు తెలుస్తోంది. టీమిండియా జాతీయ జట్టు తరపున అయిదు టెస్టులు, ఆరు వన్డేలు, రెండు టీ20 మ్యాచ్‌లు ఆడిన అతను.. తన ప్రవర్తన కారణంగా ముంబై రంజీ జట్టుకు దూరమైనట్లు స్పష్టమవుతోంది.

జట్టుకు చెందిన రెగ్యులర్ ట్రైనింగ్ సెషన్స్‌కు అతను హాజరుకావడం లేదని ముంబై క్రికెట్ సంఘం అధికారి ఒకరు తెలిపారు. పృథ్వీ షా అధిక బరువు కూడా ఉన్నట్లు తెలుస్తోందన్నాడు. ఫీల్డింగ్‌లో అతని ఫిట్‌నెస్, రన్నింగ్ అంశాన్ని పరిశీలించాలని, ముంబై క్రికెట్ సంఘం అలాంటి ప్లేయర్లను ఎంకరేజ్ చేయదని ఆ అధికారి చెప్పారు.

రంజీ ట్రోఫీ తొలి రెండు రౌండ్ల మ్యాచుల్లో అతను 7, 12, 1, 39 రన్స్ మాత్రమే స్కోర్ చేశాడు. ఫిట్‌నెస్, ప్రవర్తన ఆధారంగా అతన్ని జట్టు నుంచి తప్పించినట్లు ముంబై సీనియర్ మెన్స్ సెలెక్షన్ ప్యానల్ పేర్కొన్నది.

# రెండో టెస్టుకు కేన్ విలియమ్‌సన్ దూరం..



### కీలక ప్రకటన చేసిన కివీస్ జట్టు

**ముంబై:** న్యూజిలాండ్ క్రికెటర్ కేన్ విలియమ్‌సన్ రెండో టెస్టు దూరం కానున్నాడు. పుణెలో జరిగే ఆ టెస్టుకు అతను అందుబాటులో ఉండడం లేదని కివీస్ యాజమాన్యం ప్రకటించింది. గాయం వల్ల అతను ఇప్పటికే ఫస్ట్ టెస్టులో ఆడలేదు. గజ్జల్లో నొప్పి వల్ల అతను ఫస్ట్ టెస్టుకు అందుబాటులో లేడు. అయితే ఇంకా ఆ నొప్పి తగ్గని కారణంగా.. అతను రెండో టెస్టుకు కూడా దూరం అవుతున్నట్లు కివీస్ క్రికెట్ ప్రకటించింది. టెస్టు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా గత నెలలో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ సమయంలో కేన్ విలియమ్‌సన్ గాయపడ్డాడు. రిహాబిలిటేషన్‌లో విలియమ్‌సన్ కోలుకుంటున్నాడని కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపారు. గురువారం నుంచి జరిగే పుణె టెస్టుకు అతను అందుబాటులో ఉండడని, నవంబర్ ఒకటో తేదీ నుంచి ముంబైలో జరిగే మూడో టెస్టు అందుబాటులో ఉండేది డౌటే అని తెలిపాడు.

# కామన్వెల్త్ క్రీడల నుంచి 9 గేమ్స్ ఔట్..

### లిస్ట్‌లో క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్!

**గ్లాస్గో:** గ్లాస్గోలో జరిగే 2026 కామన్వెల్త్ క్రీడల నుంచి 9 గేమ్స్‌ను తొలగించారు. క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, స్క్వాష్, రెజ్లింగ్, షూటింగ్, నెట్ బాల్, రోడ్ రేసింగ్‌ను తొలగించారు. ఈ మేరకు కామన్వెల్త్ క్రీడల సమాఖ్య ఓ ప్రకటన విడుదల చేసింది. ఖర్చులను తగ్గించుకోవడం కోసం ఈసారి 10 గేమ్స్‌ను మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు. గ్లాస్గోలోని నాలుగు వేదికలు మాత్రమే ఆటలకు ఆతిథ్యం ఇస్తాయి.

కామన్వెల్త్ క్రీడలు నాలుగేళ్లకొసారి జరుగుతాయన్న విషయం తెలిసిందే. 2026లో స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో జరగనున్నాయి. 23వ కామన్వెల్త్ గేమ్స్ జూలై 23 నుంచి ప్రారంభమై ఆగస్టు 2 వరకు కొనసాగుతాయి. 2014లో గ్లాస్గోలోనే కామన్వెల్త్ క్రీడలు జరిగాయి. 12 సంవత్సరాల తర్వాత గ్లాస్గో మరోసారి ఆతిథ్యం




ఇస్తోంది. నిజానికి కామన్వెల్త్ క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో జరగాల్సింది. ఖర్చులు పెరగడంతో విక్టోరియా ఆతిథ్య హక్కులను వదులుకుంది. బర్మింగ్‌హామ్ వేదికగా 2022లో 19 ఈవెంట్‌లను నిర్వహించారు. 2026లో మాత్రం 10 ఈవెంట్‌లను మాత్రమే నిర్వహించాలని కామన్వెల్త్ క్రీడల సమాఖ్య నిర్ణయించింది.

2022 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ 61 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇందులో 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్య పతకాలు ఉన్నాయి. రెజ్లింగ్‌లో అత్యధికంగా 12 పతకాలు రాగా.. వెయిట్ లిఫ్టింగ్‌లో 10 మెడల్స్ వచ్చాయి. కామన్వెల్త్ క్రీడల సమాఖ్య నిర్ణయం భారత్‌కు ఎదురుదెబ్బే అని చెప్పాలి. ఎందుకంటే హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, క్రికెట్, షూటింగ్‌లో మనకు ఎక్కువ పతకాలు వచ్చే అవకాశం ఉండేది.



# మహేశ్.. రాజమౌళి సినిమాలో అదే హైలెట్..!

టాప్ డైరెక్టర్ రాజమౌళి.. టాప్ హీరో మహేశ్ బాబు వీరిద్దరి కాంబినేషన్ లో మూవీ అంటే మాములుగా ఉంటుందా? కచ్చితంగా భారీ అంచనాలు ఉంటాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి ఏ అప్ డేట్ కూడా బయటకు రావడం లేదు.. కథ ఏమిటి? ఏ జోనర్ లో ఈ కథ తెరకెక్కబోతున్నది? జానపదమా? చారిత్రకమా? అన్న విషయంలో అస్సలు క్లారిటీ లేదు. అందుకే ఈ సినిమాకు సంబంధించి ఏ చిన్న అప్ డేట్ వచ్చినా ఫ్యాన్స్ ఎగిరి గంతేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీకి సంబంధించి ఓ ముఖ్యమైన అప్ డేట్ బయటకు వచ్చింది. ఆర్ఆర్ఆర్ మూవీలో జంతువులను విపరీతంగా వాడుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమాలో అంతకు మించి జంతువులను వాడుకోబోతున్నారట. అమెజాన్ అడవుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని ఇప్పటికే టాక్ బయటకు వచ్చిన విషయం తెలిసిందే. కాగా తాజాగా ఈ మూవీకి సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని రాజమౌళి పంచుకున్నారు. 'నాకు జంతువులంటే ఇష్టం. ఆర్ఆర్ఆర్ తో సహా గతంలో నేను తీసిన సినిమాల్లో జంతువులను ఉపయోగించాను. ఒక విషయం అయితే కచ్చితంగా చెప్పగలను. 'ఆర్ఆర్ఆర్' కంటే ఎక్కువ జంతువులు నా తదుపరి మూవీస్‌లో ఉంటాయి'' అని అన్నారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సరికొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని సినిమాలు తీయడంలో రాజమౌళి సిద్ధహస్తుడు. ఆయన విజన్ నుంచి వచ్చిన 'ఈగ', 'బాహుబలి' మూవీ విజువల్ వండర్‌స్‌గా నిలిచాయి. ఇప్పుడు మహేశ్‌బాబుతో మూవీ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయం తీసుకోనున్నారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విషయాలను అధ్యయనం చేసేందుకు పలు తరగతులకు హాజరవుతున్నారట జక్కన్న.





## సినిమా

# సూర్యకు జోడీగా సీత

సీతారామం మూవీతో తెలుగు సినీ ప్రియుల మనసులో చెరగని ముద్ర వేసింది మృణాల్ ఠాకూర్. సీతారామం హిట్ కావడం మృణాల్ ఇమేజ్ ను మార్చేసింది. వరసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నది. తాజాగా తమిళ అగ్రహీరో సూర్య పక్కన కూడా చాన్స్ కొట్టేసినట్టు తెలుస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో సూర్య 45 అనే మూవీ రాబోతున్నది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అతి త్వరలోనే సెట్స్ మీదకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకి సంబంధించి ఇంట్రెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతున్నాయి. ఈ మూవీ భక్తిరసంతో కూడిన ఒక డివోషనల్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ గా రూపొందనుందనే టాక్ వినిపిస్తోంది. ఈ మధ్య కాలంలో ఇండియన్ సినిమాలో భక్తిరస చిత్రాలకు ప్రేక్షకాదరణ లభిస్తోంది. పురాణాలు, ఇతిహాసాలు, దేవుళ్ళు, దేవతలు.. కథాంశాలతో తెరకెక్కిన చిత్రాలు భాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. RJ బాలాజీ ఇంతకముందు తన స్వీయ దర్శకత్వంలో 'అమ్మోరు తల్లి' అనే డివోషనల్ ఫాంటసీ కామెడీ చిత్రాన్ని రూపొందించారు. మరి ఈ సినిమాలో మృణాల్ కు ఎటువంటి క్యారెక్టర్ దక్కబోతున్నది అన్నది వేచి చూడాలి.



# రెస్ట్ లేకుండా రజనీ షూటింగ్..!

73 ఏండ్ల వయసులో రజనీ స్పీడ్ చూస్తుంటే ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. వరసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు రజనీకాంత్. యంగ్ హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నాడు. ఇటీవల విడుదలైన వెట్టయాన్ పెద్దగా సక్సెస్ కాలేదు. కలెక్షన్లు వచ్చినప్పటికీ.. కమర్షియల్ హిట్ కాలేకపోయింది ఇదిలా ఉంటే రజనీకాంత్ లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్ లో కూలీ అనే మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. అందుకు కారణం డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్.. అతడి సినిమాలకు చాలా మాస్ ఫాలోయింగ్ ఉంటుంది. దీనికి రజనీ తోడైతే సంచనాలు నమోదు చేయడం ఖాయమని అంతా అనుకుంటున్నారు. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. అయితే రజనీకాంత్ కి గాయమవ్వడంతో షూటింగ్ తాత్కలికంగా వాయిదా వేశారు. శస్త్ర చికిత్స కారణంగా ఆయన కొన్ని రోజులుగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ కొత్త షెడ్యూల్ కి సంబంధించి సెట్స్ పనుల్లో నిమగ్నమైంది. తాజాగా సెట్ నిర్మాణం పూర్తవ్వడంతో పాటు రజనీ కూడా కోలుకోవడంతో కొత్త షెడ్యూల్ మొదలు పెట్టడానికి సమాయత్తం అవుతున్నారు. ఇందులో రజనీతో పాటు ప్రధాన తారాగణంపైకీలక యాక్షన్ సన్నివేశాలు చిత్రీ కరించనున్నట్లు సమాచారం. ఈ మూవీలో రజనీకాంత్ గోల్డ్ స్మగ్లర్ పాత్రలో కనిపించనున్నారు. రక్తపాతం..గన్స్ పేలుళ్లతో కూలి మొత మోగిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటీవలే లోకేష్ మరో ఐదేళ్ల పాటు తన నుంచి ఈ హింసత్మాక సన్నివేశాలు ప్రేక్షకులు భరించాల్సిందేనని చెప్పేసాడు.



# ఆ ప్రశ్న నన్ను బాధపెట్టింది

ఇటీవల అనన్య నాగళ్ల బాగా ట్రెండింగ్ లోకి వచ్చేసింది. పొట్టేలు మూవీ ప్రీ రిలీజ్ పంక్షన్ లో ఆమె చేసిన కామెంట్లు.. క్యాస్టింగ్ కౌచ్ మీద స్పందించిన తీరు బాగా వైరల్ అయ్యాయి. ఇదిలా ఉంటే తాజాగా అనన్య తన మనసులోని మాటను బయటపెట్టారు. ఓ ప్రశ్న తనను బాగా బాధపెట్టిందని చెప్పారు. కాస్టింగ్ కౌచ్ పై అభ్యంతరకరమైన రీతిలో ఓ మహిళా జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు హీరోయిన్ అనన్య నాగళ్ల చాలా ఇబ్బంది పడింది. నేరుగా తనకు సంబంధించిన ప్రశ్న కానప్పటికీ.. తనను మాత్రమే అడిగేసరికి, అది చాలా విధాలుగా తనను, తన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని బాధపడింది. మరీ ముఖ్యంగా తన అమ్మ ఆనందం ఆ ఒక్క ప్రశ్నతో మాయమైందని చెప్పుకొచ్చింది.

"ఇంట్లో ఫైట్ చేసి నటిని అయ్యాను. ప్రతిరోజూ బయటకొచ్చేటప్పుడు మా అమ్మ ముఖంలో ఓ టెన్షన్ ఉంటుంది. ఏం కాదమ్మా అని చెప్పే ఎక్స్ ప్రెషన్ నా ముఖంపై ఉంటుంది. వాళ్లు ఎప్పుడూ నన్ను వ్యతిరేకిస్తూనే ఉంటారు. నేను ఇండస్ట్రీకొచ్చి కుటుంబం పరువు తీసేశాననే ఫీలింగ్ లోనే ఇప్పటికీ నా బంధువులున్నారు. పొట్టేల్ తో నన్ను చూసి అంతా గర్వపడతారనుకున్నాను. సదరు మీడియా ప్రతినిధి కాస్టింగ్ కౌచ్ గురించి అడగడంతో, నేను కూడా అలానే చేసి ఈ స్థాయికి వచ్చానని నా బంధువులు అనుకుంటారు. నా బ్రదర్ పెళ్లి ఉంది, కచ్చితంగా మా అమ్మను అడుగుతారు. ఇన్నేళ్ల కష్టం ఆమె అడిగిన ఒక్క ప్రశ్నతో పోయింది. పొట్టేల్ సినిమాతో మా అమ్మ నన్ను చూసి గర్వపడింది. ఆ ఒక్క ప్రశ్నతో ఆ ఆనందం పోయింది.' అంటూ చెప్పుకొచ్చింది అనన్య.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.